Follow: @ANNTELUGU

09-02-2026

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 42 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పాత జిల్లాలు రద్దు చేయం

కొత్త జిల్లాలు ఏర్పాటు చేయం.. తేల్చిచెప్పిన సీఎం రేవంత్ రెడ్డి


భూపాలపల్లి జిల్లా రద్దు కాదు.. సింగరేణి బోర్డు కూడా రద్దు కాదు

కుట్రలు కుతంత్రాలను తిప్పికొట్టాలి

**భూపాలపల్లి, మహా :** పాత జిల్లాల రద్దు, కొత్త జిల్లాల ఏర్పాటు ఆలోచన ప్రభుత్వానికి లేదని ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కానీ పునర్వ్యవస్థీకరించాలనే ఆలోచన మాత్రమే ఉందని తెలిపారు. బహిరంగంగా ప్రజల సూచనలు తీసుకునే ఆలోచన చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నాడు చెల్పూర్‌లో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన ప్రగతిబాట' బహిరంగ సభలో ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తామని బీఆర్ఎస్ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రద్దు కాదని పునరుద్ఘాటించారు.

మిగతా 2లో

### టాప్ న్యూస్



**ఏపీలో లోకల్ వార్**

- బాబు గ్రీన్ సిగ్నల్
- మార్చి 9న నోటిఫికేషన్.. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు


02



**నామ్ నరేందర్.. కాం సరెండర్**

- ప్రధానిపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు

02



**కేసీఆర్ ఫొటోకు అజారుద్దీన్ దండంపెట్టాలి**

- బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్‌రావు

02

# కవిత పార్టీ టీఆర్ఎస్?

## జూన్ 2న ముహూర్తం ఫిక్స్..

## తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు




**మహా, హైదరాబాద్ :** తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఫిక్స్ చేసకున్నారా? సరైన సమయంలో రాజకీయ పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేస్తానని స్వయంగా చెప్పిన కవిత ఇపుడు అందుకు రెడీ అయ్యారా? తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 తెలంగాణ అపాయింట్ డే నే కవిత పార్టీ ఆవిర్భావ డే కూడా కానుందా? .రాజకీయవర్గాలు, జాగృతి వర్గాలలో జరుగుతున్న ప్రచారం ఇందుకు ఔననే సంకేతాలు ఇస్తోంది. ఇప్పటికే ఢిల్లీకి వెళ్ళిన తెలంగాణ జాగృతి టీమ్ కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో భేటీ అయింది. కొత్త పార్టీ పెట్టడానికి అవసరమైన అప్లికేషన్‌ను, ఇతర డాక్యుమెంట్లను సమర్పించింది. మూడు, నాలుగు నెలల్లో కొత్త పార్టీ కసరత్తు కొలిక్కి రానున్నది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న లాంఛనంగా ఆమె పార్టీ పేరును, జెండాను, ఎజెండాను ప్రకటించనున్నారు. అమరవీరుల కుటుంబాల సాక్షిగా తన రాజకీయ భవిష్యత్తును స్పష్టం చేయనున్నారు. పార్టీ నిర్మాణం ఎలా ఉంటుందో కూడా అదే రోజున ప్రకటించనున్నారు. ఈ లోగా నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక సన్నాహకాలను పూర్తి చేయనున్నారు.

మిగతా 2లో

### ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా...

కవిత తన రాజకీయపార్టీని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిన, కాంగ్రెస్ చేయలేని అంశాలు, సమస్యల ఎజెండాతో ప్రధానంగా నిర్మించనున్నట్లు తెలుస్తోంది. కవిత జనంబాట పర్యటనకు జిల్లాల్లో మంచి స్పందన కనిపించింది. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో కవిత పర్యటన కొందరు నేతలను హడలెత్తించింది. రంగారెడ్డి, పాలమూరు జిల్లాల్లో కవిత పర్యటన మాజీ మంత్రులను, వారి అనుచరణగణాన్ని షేక్ చేసింది. కవిత కార్యాచరణతో బీఆర్ఎస్ నేతల తప్పులు బలంగా ప్రజల్లోకి వెళ్ళగా, కూకట్ పల్లి ఎమ్మెల్యే తీరును కూడా కవిత ఎండగట్టారు. ఇక హరీష్ రావును, సంతోష్ రావును టార్గెట్ చేసి అనేక అంశాలు బయటపెట్టిన తీరు పార్టీలో అనేకమంది నేతలను సంతోషపరిచింది. కవిత డేరింగ్ అండ్ డాషింగ్ గా దూసుకుపోతున్న తీరుతో రాజకీయ అవకాశాల కోసం చూస్తున్న నేతలు టచ్ లోకి వెళ్తున్నారు. కవిత రాజకీయపార్టీ ఆషామాషీగా ఉండదని, తెలంగాణ రాజకీయాల్లో బలంగానే నిలదొక్కుకుంటుందని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.



### రాజ్యసభకు ఛాన్స్

మాజీ ఎంపీ రంజిత్ రెడ్డికి మంత్రిపదవి సాధ్యం కాకుంటే వచ్చే నెలలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానానికి పరిశీలిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. రంజిత్ రెడ్డి లేదా వేం నరేందర్ రెడ్డిలలో ఒకరికి రాజ్యసభ ఛాన్స్ దక్కవచ్చని వినపడుతోంది. వేం నరేందర్ రెడ్డికి గతంలోనే ఎమ్మెల్సీ ఇవ్వాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఇపుడు అందుకు సమయం వచ్చింది.

# మంత్రివర్గంలోకి రంజిత్ రెడ్డి?

## విస్తరణ సంకేతాలా?

సమ్మర్ లో పొలిటికల్ సెన్సేషన్

మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి

మునిసిపల్ ఫలితాల ఆధారంగా.. మార్పులు చేర్పులు

**(హైదరాబాద్, మహా)**

మునిసిపల్ మంత్రిగా బాధ్యతలు అప్పగించి చేవెళ్ళ, వికారాబాద్ మునిసిపాలిటీలన్నింటినీ అభివృద్ధి చేసే బాధ్యత మాజీ ఎంపీ రంజిత్ రెడ్డికి అప్పగిస్తానని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సమక్షంలో బహిరంగసభలో ప్రకటించడంతో విస్తరణ చర్చలు ఊపందుకున్నాయి. రంజిత్ రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలనుకుంటే కాంగ్రెస్ పార్టీలో అనేక చిక్కులుంటాయి. ప్రస్తుతం గడ్డం రంజిత్ రెడ్డి ఏ చట్ట సభలోనూ సభ్యుడు కాకపోగా, రంజిత్ రెడ్డిని మంత్రిని చేయాలంటే ముందుగా ఎమ్మెల్సీ చేయాల్సి ఉంది. అజారుద్దీన్ ఎమ్మెల్సీకి అభ్యంతరం లేదని సుప్రీంకోర్టు సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో గడ్డం రంజిత్ రెడ్డిని నిజామాబాద్ నుండి ఎమ్మెల్సీగా నిలుపుతారా? ఇందుకు కాంగ్రెస్ హైకమాండ్ అంగీకరిస్తుందా? అన్నది చూడాల్సి ఉంది. ఇక మునిసిపల్ మంత్రిగా తన బాధ్యతను రంజిత్ రెడ్డికి అప్పగిస్తానన్న సంకేతమా? అన్న చర్చ జరుగుతోంది. అయితే సీఎం రంజిత్ రెడ్డిని మంత్రిగా చేయబోతున్నారన్న చర్చ జరుగుతున్నా దీనిపై మరుసటిరోజు కూడా స్పందించలేదు. రెడ్డి కోటాలో రంగారెడ్డి జిల్లా నుండి మల్ రెడ్డి రంగా రెడ్డి, మునుగోడు నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇపుడు రంజిత్ రెడ్డి ప్రతిపాదన రావడంతో ఇద్దరికీ షాక్ తప్పదన్న చర్చ మొదలైంది.

మిగతా 2లో



### చెన్నైలో జగన్

- పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకున్న జగన్, విజయ్
- జన నాయకుడితో జన నాయగన్' అంటూ ఫొటోలు వైరల్
- జగన్ తో స్టాలిన్, సూర్య కరచాలనం

02




ఎఫ్ఎస్ఎల్‌లో అగ్నిప్రమాదంపై

### రిటైర్డ్ జడ్జితో విచారణ జరపాలి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదం ఘటనపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డితో బీజేపీకి లాలూచీ లేకపోతే దర్యాప్తు చేయించాలని ప్రభుత్వానికి కేటీఆర్ సూటిగా సవాల్ విసిరారు. ఆదివారం హనుమకొండలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎఫ్ఎస్ఎల్‌లో అగ్నిప్రమాదం సీఎం రేవంత్ పనేనని ఆరోపించారు. చలికాలంలో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరుగుతాయా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పక్కా ప్రణాళికతో ఆధారాలు మాయం చేసేందుకు కుట్ర జరిగిందన్నారు. ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ తూతూమంత్రంగా వివరణ ఇచ్చారంటూ మండిపడ్డారు.



భారత్-ఫ్రాన్స్ మధ్య

### రాఫెల్ డీల్

**114 జెట్‌లను కొనుగోలు చేసే అవకాశం..**

**మహా :** భారత్, ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ నెల చివర్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ పర్యటన ముందు డిఫెన్స్

మిగతా 2లో

## కీలక కేసుల డాటా సురక్షితం

**జరుగుతున్నదంతా తప్పుడు ప్రచారం**

ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు ఆధారాలు చెక్కు చెదరలేదు

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టత

**హైదరాబాద్, మహా :** నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి డేటా నష్టపోలేదని ఎఫ్ఎస్ఎల్ డైరక్టర్ శిఖా గోయల్ స్పష్టత ఇచ్చారు. 2 కీలక కేసులకు సంబంధించిన డేటా ఉన్న ఫైల్స్, డిస్కులు కాలిపోయాయని జరిగిన ప్రచారంలో నిజం లేదన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదం వివరాలను ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఎఫ్ఎస్ఎల్ లో కాలిపోయిన డాక్యుమెంట్స్ ఇదివరకే ఏసీబీ కోర్టుకు సమర్పించామని, మా వద్ద లేకపోయినా కోర్టు వద్ద ఉంటాయన్నారు. ఏదైనా ఘటనలో ఆధారాలు కాలిపోయినా మా టీమ్ వాటిని డేటా నుంచి రిట్రీవ్ చేస్తుందని తెలిపారు. ఎఫ్ఎస్ఎల్ ఆఫీసులో శనివారం ఉదయం 10 గంటల 8 నిమిషాలకు అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలిపారు. మంటలను మొదట ఎఫ్ఎస్ఎల్ ఉద్యోగి గుర్తించారని, మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తే.. సాధ్యపడలేదని.. అదే సమయంలో మంటలు క్రమంగా



ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్, ట్రైనింగ్ హాల్‌కు వ్యాపించాయని తెలిపారు.

**కీలక కేసు ఆధారాలపై దుష్ప్రచారం..**

అనాలసిస్ డాక్యుమెంట్ లో కొన్ని ఫైల్స్ దగ్ధం కాగా, వాటిని గుర్తించే పనిలో ఉన్నట్లు శిఖా గోయల్ తెలిపారు. ఈ ప్రమాదంలో 2015లో నమోదైన ఓటుకు నోటు కేసుకు

మిగతా 2లో



వైన్స్ షాపులు..

## బార్లు బంద్

**నేటి సాయంత్రం నుండి 48 గంటలు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజులపాటు మద్యం దుకాణాల బంద్‌కు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా అన్ని మున్సిపాలిటీల పరిధిలోని వైన్స్, బార్లను 2 రోజుల పాటు మూసివేయనున్నారు. ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం అమ్మకాలను ఆ ప్రాంతాల్లో పూర్తిగా నిషేధించారు.



# కవిత పార్టీ టీఆర్ఎస్ ?

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక తెలంగాణ నినాదంతో పిడికిలి బిగించిన కవిత సామాజిక నినాదాలలో, విధానాలలో ఇతర రాజకీయపార్టీలకన్నా ఓ అడుగు ముందే ఉంటోంది. పూలే అంశం, బీసీ రిజర్వేషన్ల అంశం ఇతర అనేక అంశాల్లో కవిత ట్రెండ్ సెట్ చేస్తే ఇతర పార్టీలు ఫాలో అయ్యాయి. ఈ క్రమంలో తెలంగాణ జాగృతి పేరుతో పార్టీ ఉంటుందని ప్రచారం జరిగినా, ఇటీవల కవిత చేసిన చిట్ చాట్ లో తాను ప్రచారంలో ఉన్న పేర్లేవీ పరిశీలనలో లేవని చెప్పారు. దీంతో తెలంగాణ జాగృతిని ఉద్యమసంస్థగానే ఉంచి కేసీఆర్ వదిలేసిన టీఆర్ఎస్ నే తమ పార్టీపేరుగా పెట్టుకునే అవకాశం ఉందన్న చర్చ ఉంది. తెలంగాణ రాష్ట్రసమితి, తెలంగాణ రాష్ట్ర రాజకీయ సమితి, తెలంగాణ రక్షణ సమితి, తెలంగాణ రైతు శ్రామికుల పార్టీ పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ అధినేతగా కవిత ఎన్నికల బరిలో నిలిచే అవకాశాలున్నాయి. పార్టీ పేరు మార్పుపై కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని తాను కూడా వ్యతిరేకించినట్లు స్వయంగా కవితే పలు సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు ఆ మిస్టేక్ చేయకుండా తెలంగాణ ప్రజల సెంటిమెంట్ కు అనుగుణంగా పార్టీ పేరులో తెలంగాణ అనే పదాన్ని పార్టీలో పెట్టాలని కవిత డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

# మంత్రివర్గంలోకి రంజిత్ రెడ్డి?

(మొదటిపేజీ తరువాయి)

అయితే కాంగ్రెస్ రాజకీయాల్లో రంజిత్ రెడ్డిని మంత్రిని చేయడం ఇప్పటికిపుడు అంత తేలికైన వ్యవహారం కాదన్న చర్చ కూడా ఉంది.

**సీఎం ప్రకటనతో సంబరాలు**

సీఎం రేవంత్ రెడ్డి పరిగి వేదికగా చేసిన వ్యాఖ్యలతో మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత రంజిత్ రెడ్డికి మంత్రి వర్గంలో చోటు ఖాయమైనట్లు స్పష్టమవుతోంది. పరిగి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి డాక్టర్ రంజిత్ రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధిలో ప్రభుత్వం వైపునుంచి కూడా మీకు అండగా రంజిత్ రెడ్డి నిలబడతడు.. మీరందరూ కలిసి కట్టుగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోండని సీఎం రేవంత్ సూచించారు. ప్రతి మున్సిపాలిటీలో ప్రత్యేకమైన అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొని.. రంజిత్ రెడ్డికి మున్సిపల్ మంత్రిగా బాధ్యతలు అప్పగిస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతీ మున్సిపాలిటీకి ప్రత్యేకమైన నిధులు ఇస్తా.. ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చే బాధ్యత నాది.. రంజిత్ రెడ్డి సహకారంతో పని చేయించుకునే బాధ్యత మీది అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. డాక్టర్ రంజిత్ రెడ్డి 2019 పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన రంజిత్ రెడ్డి.. అదే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ రాజకీయ నేతగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. పరిగి బహిరంగ సభలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో మున్సిపల్ ఎన్నికల తరువాత కేబినెట్ విస్తరణ జరగడం.. మున్సిపల్ శాఖ మంత్రిగా రంజిత్ రెడ్డి బాధ్యతలు చేపట్టడం ఖాయమని అబిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

**త్వరలో మంత్రివర్గ ప్రక్షాళన**

మునిసిపల్ ఎన్నికల ఫలితాలు, స్థానిక ఫలితాల ఆధారంగా మంత్రివర్గ ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ హైకమాండ్, సీఎం రేవంత్ రెడ్డి డిసైడ్ అయ్యారు. ఖాళీ పదవి భర్తీతో పాటు ఒకరిద్దరికి ఉద్వాసన ఉండవచ్చని కూడా వినబడుతోంది. ఈ సమ్మర్ తర్వాత పార్టీపరంగా ప్రక్షాళన ఉంటుందని, ఎన్నికల వ్యూహాలతో ప్రభుత్వం పనిచేస్తుందని అంచా వేస్తున్నారు. మేలో ఖమ్మం, వరంగల్ కార్పోరేషన్ ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఆ తర్వాతే మంత్రివర్గంలో, శాఖలలో మార్పులు చేర్పులు జరగవచ్చు.

# రేవంత్, కేసీఆర్‌లు రాహు, కేతువులు

**బీజేపీ చీఫ్ రాంచందర్ రావు**




**కొత్తగూడెం, మహా :** సీఎం రేవంత్ రెడ్డి రాహువు అయితే.. మాజీ సీఎం కేసీఆర్ కేతువు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అభివర్ణించారు. ఈ రాహు కేతువుల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడాలంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కొత్తగూడెంలో బీజేపీ విజయ సంకల్ప సభ పేరిట నిర్వహించిన భారీ సభలో రాంచందర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని బీఆర్ఎస్ పార్టీ అని విమర్శించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ఒక్కటి మినహా హామీల అమలులో విఫలమైందంటూ మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కేంద్ర పథకంతో ఇంటింటికీ తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ వస్తుందన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో పన్నుల వసూళ్లు మినహా పనులు లేవని రాంచందర్ రావు వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొనటం వెనుక ఉన్న ఆంతర్యాన్ని గమనించాలంటూ ప్రజలకు సూచించారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమి తీసుకువచ్చిన అమృత్ పథకంతో కొత్తగూడెం కార్పొరేషన్ ఆధునీకరణ పనులు చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీలోని వర్గ పోరుతో కుంభకోణాలు బట్టబయలు అవుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణిలో నైనీ టెండర్ల రద్దు వెనుక కుంభకోణం ఉందని ఆరోపించారు. సింగరేణిలో అప్పుల కారణంగా జీతాలు ఇవ్వలేని స్థాయికి దిగజార్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ సూచనల మేరకు సింగరేణిపై ఇటీవల కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సమీక్షించారన్నారు. సింగరేణి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర కేబినెట్ లోని బీసీల లెక్క తేల్చాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసన సభలో సభ్యత్వం లేకుండా ఒక ముస్లింకి మంత్రి పదవి కేటాయించారని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలవి ఒకే విధానాలని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కుంభకోణాల ఫైల్స్ కాలిపోయాయని, దీంతో వాస్తవాలు బట్టబయలు కాకుండా కుట్ర జరిగిందంటూ టీ బీజేపీ చీఫ్ నిప్పులు చెరిగారు. పోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన ఎఫ్ఎస్ఎల్ ఫైల్స్ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో తగులబడటం వెనుక ఆంతర్యాన్ని గమనించాలన్నారు. ఓటుకు నోటు కేసును 10 ఏళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అవినీతి విచారణల్లో అధికారులను అరెస్ట్ చేశారని.. మరి నాయకులపై చర్యలు ఏవంటూ ఆయా పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిద్దాం, తెలంగాణను కాపాడు కుందామంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.

# పాత జిల్లాలు రద్దు చేయం
# కొత్త జిల్లాలు ఏర్పాటు చేయం

**తేల్చిచెప్పిన సీఎం రేవంత్ రెడ్డి**

- భూపాలపల్లి జిల్లా రద్దు కాదు.. సింగరేణి బోర్డు కూడా రద్దు కాదు
- కుట్రలు కుతంత్రాలను తిప్పికొట్టాలి



విపక్షాల కుట్రలు, కుతంత్రాలను నమ్మొద్దంటూ ప్రజలకు సీఎం రేవంత్ సూచించారు. రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదంటూ ఆ పార్టీ నేతలను హెచ్చరించారు. కొందరికి విషం చిమ్మడమే పనిగా మారిందంటూ విపక్షాలపై కారాలు మిరియాలు నూరారు. కార్మికులకు నష్టం కలిగే ఏ పనీ చేయబోమన్నారు. ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు.. టీవీలు, పేపర్లు పెట్టుకున్నారంటూ విపక్ష పార్టీలోని అగ్రనేతలపై విమర్శలు గుప్పించారు. పదేళ్లలో వందల, వేల ఎకరాలు సంపాదించుకున్నారని సదరు నేతలపై నిప్పులు చెరిగారు. పేదల ఆత్మగౌరవం కోసం పని చేయలేదంటూ కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల బాగుకోసం కేసీఆర్ ఎలాంటి ఆలోచన చేయలేదన్నారు. తమ ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తుందన్నారు. తెలంగాణలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు.

**ఏప్రిల్ లో రెండో విడత ఇళ్ళు**


ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.22,500 కోట్ల వ్యయం అవుతుందని సీఎం రేవంత్ వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రూ.100కోట్లతో మేడారం అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు. ఇటీవల ముగిసిన జాతరలో సమ్మక్కసారలమ్మను 2 కోట్ల మంది భక్తులు దర్శించుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. కేసీఆర్ వచ్చిన తర్వాత పిట్టకథలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాలేదు కానీ.. ఎర్రవల్లిలో కేసీఆర్‌కు ఫామ్‌హౌస్ మాత్రం వచ్చిందంటూ ఎద్దేవా చేశారు. విపక్షాలు బీఆర్ఎస్, బీజేపీలకు ఓట్లు అడిగే అర్హత లేనే లేదని కుండబద్దలు కొట్టారు. కేసీఆర్, మోదీని చూసి ఓటు వేస్తే మోసపోతామంటూ భూపాలపల్లి జిల్లా ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అధికారంలో ఉన్న మమ్మల్ని చూసి ఓటు వేయండంటూ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీల్లో పనులు చేసేది కాంగ్రెస్ ప్రజాప్రతినిధులేనని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రూ.6,116 కోట్లతో వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడతామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కల్వకుంట్ల కుటుంబానికే పదవులు వచ్చాయని విమర్శించారు. తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు.. తనను ఏ పేరుతో పిలిచినా ఫర్వాలేదన్నారు. కానీ మీ పక్కనే ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మాత్రం కిషన్ రావు అంటున్నారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతున్నది బీజేపీ కాదా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. సీబీఐ, ఈడీ మీ చేతుల్లోనే ఉన్నాయి కదా? అంటూ బీజేపీ అగ్రనేతలకు సీఎం రేవంత్ గుర్తు చేశారు. మరీ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌లు అరెస్టు కాకుండా ఎవరు అడ్డుపడుతున్నారంటూ సందేహం వ్యక్తం చేశారు.

**కేసీఆర్ ను సీబీఐ ఎందుకు పిలవట్లే?**

కాళేశ్వరంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని గుర్తు చేశారు. మరి ఆ కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదంటూ సీఎం రేవంత్.. బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. కేసీఆర్‌ను అరెస్టు చేసే వరకు కిషన్‌రెడ్డిని కిషన్‌రావే అని పిలుస్తారంటూ సీఎం రేవంత్ కుండబద్దలు కొట్టారు. కేసీఆర్‌కు కేటీఆర్ దొంగపుత్రుడైతే.. కిషన్‌రెడ్డి దత్త పుత్రుడు అంటూ సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఫోన్ ట్యాపింగ్‌తో రూ.వేల కోట్లు సంపాదించారంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారానే బిల్డర్లు, రియల్టర్లను బెదిరించి.. ఎలక్టోరల్ బాండ్లు తీసుకున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ అంటే.. బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. ఇవాళ్టి నుంచి ఆ పేరుతోనే పిలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కరీంనగర్ లో వందకోట్ల కబడ్డీ ఆట

**బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు**



**కరీంనగర్, మహా :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎన్నికల ప్రచారంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో కబడ్డీ ఆట మొదలైందని చెప్పారు. ఇండియా పేరుతో బీజేపీ, పాకిస్తాన్ పేరుతో ఎంఐఎం/కాంగ్రెస్ పార్టీల మధ్య మ్యాచ్ ఉండబోతోందని కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్ కుదిరిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ డబ్బుతో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లోని మీడియా, సోషల్ మీడియాసహా యువకులంతా కుల, మతాలకు అతీతంగా ఒక్కటై కాంగ్రెస్, ఎంఐఎం చేస్తున్న కుట్రలను వివరించాలని పిలుపునిచ్చారు. 'కరీంనగర్‌కు రక్షణ కవచంగా నేనుంటా. కరీంనగర్‌లో కాంగ్రెస్, ఎంఐఎం కుట్రలకు తగిన బుద్ధి చెప్పండి' అని బండి కోరారు.

# ఏపీలో లోకల్ వార్.. బాబు గ్రీన్ సిగ్నల్

**మార్చి9న నోటిఫికేషన్ .. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తోంది. మార్చి 9వ తేదీన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం ముగుస్తుండటంతో, సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమవుతోంది. కొత్త ఓటర్ల జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్లు జారీ చేశారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సకాలంలో ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**త్వరలో ముగియనున్న మున్సిపాలిటీల పదవీకాలం..**

ఏపీలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం వచ్చే నెల 17తో ముగియనుంది. మరోవైపు గ్రామ పంచాయతీలో పదవీకాలం ఏప్రిల్ 2న ముగియనుంది. మున్సిపల్ పోరుకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే జిల్లాల వారీగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 జనవరి 1వ తేదీని ప్రామాణికంగా తీసుకుని కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎస్ఈసీ ఆదేశించింది. మార్చి 9న ఫోటోలతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

**మొదట మున్సిపాలిటీ, తరువాత పంచాయతీ ఎన్నికలు..**

ఏపీలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) ఉన్నాయి. వీటిలో మెజారిటీ స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. 13,351 పంచాయతీలలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు మొదలు కానున్నాయి. ఇప్పటికే వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల ఓటర్ జాబితాకు నోటిఫికేషన్ రావడమంటే ఎన్నికల నగరాలో తొలి ఘట్టం అని తెలిసిందే. స్థానిక సంస్థల నోటిఫికేషన్ తేదీపై స్పష్టత రావడంతో ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ రాజకీయ సమీకరణాలు మొదలుపెడతాయి.

# జీవితం సూటిగా సాగదు

**ఫ్లెక్సిబుల్‌గా ఉండి పట్టుదలతో ముందుకువెళ్లండి.. జెన్‌జీకి రాహుల్ గాంధీ సందేశం**



**మహా:** నేటి యువత జీవితంపై అతిగా ఒత్తిడి పడాల్సిన అవసరం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. జీవితం ఎప్పుడూ ఒకే దారిలో సూటిగా సాగదని అభిప్రాయపడ్డారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆలోచనలు మార్చుకుంటూ, పట్టుదలతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని జెన్‌జీకి సందేశం ఇచ్చారు. ఆదివారం ఢిల్లీలో యూఏఈకి చెందిన ఎన్ఆర్ఐ జెన్‌జీ విద్యార్థులతో రాహుల్ గాంధీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యువత అడిగిన ప్రశ్నలకు ఆయన నేరుగా, ఎలాంటి ఫిల్టర్లూ లేకుండా సమాధానాలు ఇచ్చారు. ఆ సంభాషణకు సంబంధించిన వీడియోను తన యూట్యూబ్ ఛానల్‌లో పంచుకున్నారు. విద్యార్థులతో చర్చలో నేటి యువత ఎదుర్కొంటున్న ఒత్తిడులు, భవిష్యత్‌పై అనిశ్చితి, కెరీర్ ఎంపికలపై సందేహాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. కెరీర్‌తో పాటు ప్యాషన్‌ను ఎలా కొనసాగించాలి? స్వేచ్ఛగా ఆలోచించడానికి, మాట్లాడడానికి ధైర్యం ఎలా పెంపొందించుకోవాలి? ఇతరుల విమర్శలు, జడ్జ్‌మెంట్‌ను ఎలా ఎదుర్కోవాలి? వంటి ప్రశ్నలను విద్యార్థులు ముందుంచారు. వారిలో చాలామంది తమకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉందని, ఇతరులు ఎలా చూస్తారోనన్న భయం వెంటాడుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్ గాంధీ, సమాజం మనపై లేబుల్స్ వేయడానికి ప్రయత్నిస్తుందని, కానీ మన అసలైన వ్యక్తిత్వాన్ని మనమే నిర్ణయించుకోవాలని సూచించారు. "ప్రపంచం మీకు మీరు ఎవరో చెబుతుంటుంది. కానీ మీకు మీరు నిజాయితీగా ఉండటం ముఖ్యమైంది" అన్నారు.

# నామ్ నరేందర్.. కాం సరెండర్

**ప్రధానిపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు**

**అమరావతి, మహా:** ప్రధాని నరేంద్ర మోదీ తీరు 'నామ్ నరేందర్.. కాం సరెండర్' అమెరికా చేతిలో ప్రధాని కీలుబొమ్మ అని ఏపీ కాంగ్రెస్ స్టేట్ చీఫ్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదివారం ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికాతో జరిగింది గ్రేట్ డీల్ కాదని, ఇండియాకు బ్లాక్ డీల్ అని పేర్కొన్నారు. దేశ రైతాంగానికి, పరిశ్రమల రంగానికి బ్లాక్ డే.. అగ్రరాజ్యం బ్లాక్ మెయిల్ కి తలొగ్గి దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడం దారుణమని మండిపడ్డారు. ఈ డీల్ దేశ భవిష్యత్ కే పొంచి ఉన్న ప్రమాదం అని హెచ్చరించారు. సున్నా సుంకాలతో భారత మార్కెట్‌ను అమెరికా ఉత్పత్తులు శాసించాయంటే స్వదేశీ ఉత్పత్తులకు ఇది మరణశాసనమేనని చెప్పుకొచ్చారు.

# కేసీఆర్ ఫొటోకు అజారుద్దీన్ దండంపెట్టాలి

**బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్‌రావు**

**సంగారెడ్డి, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తాము ప్రశ్నించినందుకే అజారుద్దీన్‌కు మంత్రి పదవి దక్కిందని కేసీఆర్ ఫొటోకు అజారుద్దీన్ దండం పెట్టాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. అజారుద్దీన్‌కి మంత్రి పదవి వచ్చి మూడు నెలలు అయింది. కానీ ఇంకా ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. ఇంకో 3నెలల్లో ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ పదవి పోతుందన్నారు. ఆదివారంసంగారెడ్డి జిల్లాలో మాట్లాడిన హరీశ్‌రావు పోలీసులపై సంచలన కామెంట్స్ చేశారు. కొంత మంది పోలీసుల అధికారులు తమ వారిని ఇబ్బంది పెడుతున్నారని అలాంటి అధికారులందరి పేర్లు పింక్ బుక్కులో రాసుకుంటున్నామన్నారు.

# భారత్-ఫ్రాన్స్ మధ్య రాఫెల్ డీల్

**114 జెట్‌లను కొనుగోలు చేసే అవకాశం..**

(మొదటిపేజీ తరువాయి)

అక్విజేషన్ కౌన్సిల్ దీనికి పచ్చజెండా ఊపే అవకాశం ఉంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతగా ఉన్న కౌన్సిల్ త్వరలో సమావేశం కానుంది. రక్షణ కార్యదర్శి నేతృత్వంలోని రక్షణ సేకరణ బోర్డు గత నెలలో ఇప్పటికే రాఫెల్ కనుగోలు ప్రతిపాదనను ఆమోదించింది. ఈ రాఫెల్ డీల్ ఓకే అయితే, భారత్ చరిత్రలోనే అతిపెద్ద యుద్ధ విమానాల సేకరణల్లో ఒకటిగా మిగులుతుంది. దీని విలువ సుమారుగా రూ. 3.25 లక్షల కోట్లుగా ఉంటుంది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తీవ్రమైన స్క్వాడ్రన్ల కొరతను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఈ డీల్ కుదిరితే భారత వాయుసేన సామర్థ్యం మరింత పెరుగుతుంది.

# కీలక కేసుల డాటా సురక్షితం




(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి, ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి, అలాగే కొన్ని కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవలం లేదన్నారు. ఆ వార్తల్లో నిజం లేదని, అసత్య ప్రచారాలను ఎవరు నమ్మవద్దని సూచించారు. 2015లో నమోదైన ఏసీబీకి సంబంధించిన ఓటుకు నోటు కేసు మెటీరియల్స్ ధ్వంసం అయినట్లు ప్రచారం జరిగిందన్నారు. అయితే కేసుకు సంబంధించిన మెటీరియల్స్ 2021 లో ఏసీబీ కోర్టుకు సబ్మిట్ చేశామన్నారు. ఓటుకు నోటు కేసు పూర్తి రిపోర్టులను ఆల్రెడీ ఏసీబీకి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఇచ్చిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాలిపోయిన ఆధారాలు ఏసీబీ దగ్గర ఉన్నాయని తెలిపారు. కేసుకు సంబంధించిన ఆధారాలలో ఎలాంటి నష్టం జరుగలేదని పేర్కొన్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసు వివరాలను సైతం ఏసీబీ కోర్టుకు సబ్మిట్ చేశాం. 7 ఆధారాలు మినహా మిగతా వాటిని కోర్టుకు సమర్పించినట్లు శిఖా గోయల్ పేర్కొన్నారు. ఏదైనా కేసులకు సంబంధించిన ఆధారాలు, పరికరాలను ఎఫ్ఎస్ఎల్ జాగ్రత్తగా ఉంచుతందని, డేటాను టీమ్ రిట్రీవ్ చేస్తుందని క్లారిటీ ఇచ్చారు.

**కేసు నమోదు చేసిన పోలీసులు**

ఈ అగ్నిప్రమాదంపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు పకడ్బందీగా ఉండేచోట కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు రావడ, కీలక పత్రాలు ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా కావాలనే సాక్ష్యాలను రూపుమాపడానికి ఈ పని చేశారా అనే కుట్ర కోణంపై పోలీసులు దృష్టి సారించారు. కేసు దర్యాప్తు తర్వాత మరిన్ని వివరాలను తెలుపుతామని శిఖా గోయల్ మీడియాకు చెప్పారు.







# చెన్నైలో జగన్

**పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకున్న జగన్, విజయ్**

**జన నాయకుడితో జన నాయగన్' అంటూ ఫొటోలు వైరల్**

**జగన్ తో స్టాలిన్, సూర్య కరచాలనం**

**చెన్నై, మహా:** రాజకీయ, సినీ రంగాలకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఒకే వేడుకలో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్, నటుడురాజకీయ నేత 'దళపతి' విజయ్ ఆదివారం చెన్నైలో జరిగిన ఒక వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్.. ఇద్దరు అగ్రనేతలతో కలిసి కనిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైసీపీ అధినేత జగన్ బంధువు వై.ఎస్. సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్ రెడ్డి వివాహం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. జగన్, విజయ్ పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించుకోవడం కెమెరాల కంటపడింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జననాయకుడితో జననాయగన్ అంటూ ఫొటోలు అభిమానులు వైరల్ చేశారు. టీవీకే పేరుతో విజయ్ రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు, 'జన నాయగన్' అనే తన సినిమా సెన్సార్ వివాదాలతో వార్తల్లో నిలిచారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో జగన్, స్టాలిన్ వంటి ప్రముఖ నేతలతో విజయ్ కనిపించడం తమిళ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ వివాహ వేడుకకు నటులు సూర్య, కార్తి కూడా హాజరయ్యారు. చెన్నైలో జగన్ ఎట్రాక్షన్ గా మారారు.

# బిజెపి నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరికలు...

**పార్టీలోకి ఆహ్వానించిన సబితా ఇంద్రారెడ్డి**




**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్ బిజెపి సీనియర్ నాయకులు శ్రీలం తిరుపతిరెడ్డి తో పాటు అతని అనుచరులు బాజపాను వీడి డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో సబితా రెడ్డి, కార్తీక్ రెడ్డి సమక్షంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బిజెపి పార్టీలో గుర్తింపు లేదు, ప్రజా సమస్యలపై పోరాడుతున్న బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూబిఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాము.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. తెలంగాణ ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ధర్మారెడ్డి, రమేష్ ముదిరాజ్, శ్రీధర్ రెడ్డి, కిషోర్ కుమార్, సూ రెడ్డి వెంకట్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, మురళి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమతా కుంబ్ కన్నుల పండుగ 4వ బ్రహ్మోత్సవాలు

**జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలు రథచక్రాల్లాంటివి.. శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి**

**రాజేంద్రనగర్, మహా :** సమతాకుంభ్-2026 బ్రహ్మోత్సవాల్లో భాగంగా శంషాబాద్ మండలం ముచ్చింతల్ లోని శ్రీరామనగరంలోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఆదివారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో చివరి ప్రధాన ఘట్టంగా నిర్వహించిన రథోత్సవంలో స్వామివారు చక్రస్నానం కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.ఈ సందర్భంగా శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ, మానవ దేహం ఒక రథంలాంటిదని, ఆ రథంలో ఆ దేవదేవుడు నివసిస్తున్నాడని చాటి చెప్పే మహోత్సవమే రథోత్సవమని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలు రథచక్రాల్లాంటివని, వాటిని సమతతో నడిపించేదే జీవన ప్రయాణమని భక్తులకు తెలిపారు.రథోత్సవంలో మై హోమ్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరావు కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన చక్రస్నానంలో చిన్న జీయర్ స్వామి స్వయంగా పాల్గొని శ్రీరామచంద్రుల వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం కోనేరులో పెరుమాళ్లతో సహా ప్రవేశం చేసి చక్రస్నానం ఉత్సవానికి శుభాంతం పలికారు.





## బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ నియామకం

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం ముచింతల గ్రామంలో బి అర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మంచర్ల మోహన్ రావ్ ఆధ్వర్యంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. అధ్యక్షులుభానురి శివశంకర్, ఉపాధ్యక్షులు జొన్నాడ శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి కడేల పెద్ద శేఖర్, కార్యదర్శి బీర్ల క్రాంతి కుమార్, జాయింట్ సెక్రెటరీ చాకలి చంద్రయ్య, కోశాధికారి చాకలి వెంకటేష్ లతో బిఆర్ఎస్ పార్టీ నూతన గ్రామా కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులుదిద్యాల శ్రీనివాస్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంటా సతీష్, మాజీ రాష్ట్ర ఎస్సి ఎస్ టి కమిషన్ సభ్యులు చిలకమర్రి నర్సింహా, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా, నర్కుడా గ్రామా కమిటీ అధ్యక్షులు మహేష్ యాదవ్, జొన్నాడ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న అంజలి

**11 వార్డు అభివృద్ధి పూర్తి స్థాయి భాధ్యత తీసుకుంటా....**
**గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన 11 వ వార్డు**



**ఆమనగల్లు, మహా:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 11 వార్డు అభివృద్ధికి పూర్తిస్థాయి బాధ్యత తీసుకుంటానని ,అభివృద్ధి కోసం తనను ఆదరించి ఆశీర్వదించి 11 వ వార్డు కౌన్సిలర్ గా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజలి విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని 11వ వార్డులో మద్దతుదారులతో కలిసి విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి ఓటు వేయండి అంటూ అభ్యర్థించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో 11వ వార్డు అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు .గతంలో పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఈ వార్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. వార్డులో తనను గెలిపిస్తే 11వ వార్డు పరిధిలోని అన్ని గల్లీలో సీసీ రోడ్డు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తానన్నారు .అధికార పార్టీతో మాత్రమే అభివృద్ధి సాధ్యమని ఇతరుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆదరించి ఆశీర్వదించి హస్తం గుర్తుకు ఓటు వేసి కౌన్సిలర్గా గెలిపించవలసిందిగా అంజలి విజ్ఞప్తి చేశారు.ప్రచారం లో రోజు రోజుకు ప్రజలనుండి విశేష స్పందన లభిస్తోంది ప్రజలు పెద్ద ఎత్తున ప్రచారం లో పాల్గొంటున్నరు.



## విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గం

**ఆదిలాబాద్ మహా :** తలమడుగు మండలం బరంపూర్ గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా కనపర్తి శేఖర్ ,ఉపాధ్యక్షుడిగా పర్వతాల వంశీ, కోశాధికారిగా అల్లుల మనోజ్, సలహాదారుడిగా పర్వతాల లక్ష్మణ్, కంచర్ల ప్రవీణ్ లను ఎన్నుకున్నట్టు విశ్వ బ్రాహ్మణ కుల సభ్యులు తెలిపారు. సంఘ అభివృద్ధి కోసం కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటి సౌభాగ్యం

- **కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల పక్షమే**
- **గత పాలనలో దోపిడీకి గురైన ఇబ్రహీంపట్నం అభివృద్ధి నోచుకోలేదు**
- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**
- **మున్సిపాలిటీలో రంగన్న ప్రచారానికి భారీగా కదలిన జనం**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల పక్షమే ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పాత బస్టాప్ దగ్గర నిర్వహించిన కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు... ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో గతంలో నేను పాదయాత్ర చేసిన సమయంలో ప్రజలు మురికి కాలువల మధ్య జీవిస్తున్న విషయాన్ని గమనించిన నేను అప్పుడే వారికీ హామీ ఇచ్చాను. మీకు మురికి కాలువ అనేది కనపడకుండా చేస్తా అని నేడు 225 కోట్లతో అండర్ డ్రైనేజి, సీసీ రోడ్లు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది దని ఎమ్మెల్యే అంటారు. శంకుస్థాపన చేసిన అభివృధి కార్యక్రమాలను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన మండిపడ్డారు. గత సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు మిమ్మల్ని చిత్తు చిత్తుగా ఓడించిన ఇంకా సిగ్గురాలేదని అన్నారు. మీలాగా మేము కబ్జాలు చేయడం లేదు పేద ప్రజలకు న్యాయం చేస్తున్నాం. వారికి సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారంటీలలో నాలుగురు గ్యారంటీలు పూర్తి చేయడం జరిగిందని త్వరలోనే మిగితావి పూర్తి చేస్తాంఅని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు పేద ప్రజల పక్షాన ఉంటుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ మన గల్లీలో ఉంటేనే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ రూపురేకలు మార్చటానికి అవకాశముంటుందని అన్నారు. వార్డులలో కమ్యూనిటీ హాల్ త్వరలో నిర్మించుకోవడం జరుగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇబ్రహీంపట్నంలో బిఆర్ఎస్ పార్టీ ఉనికే లేదు. మున్సిపాలిటీ పదవ వార్డు ఖానాపూర్ లో జనరల్ మహిళా స్థానానికి అభ్యర్థి కరువై, ఎన్నికల లో పోటీల్లో లేకుండా కనుమరుగయింది. మున్సిపాలిటీలోని కుల సంఘాలకు, మహిళా సంఘాలకు పక్కా భవనాలు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మరుగున పడిన ఇబ్రహీంపట్నంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, అంబేద్కర్ భవనాన్ని నిర్మాణంలో పనులు మధ్యలోనే ఆగిపోవడంతో ఈ యొక్క భవనాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. గత పాలకులు దోచుకుని దాచుకున్నారే తప్ప ప్రజల పక్షాన నిలబడలేదని ప్రజలకు కావాల్సిన కనీస వసతులు కల్పించలేదని ఎమ్మెల్యే రంగారెడ్డి మండిపడ్డారు. మున్సిపాలిటీ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వాళ్ల సంక్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ప్రభుత్వ శాఖ చైర్మన్లు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.



## మహేష్ ను గెలిపించండి అభివృద్ధి బాధ్యత నాదే

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి**

**ఆమనగల్లు, మహా:** మున్సిపల్ ఎన్నికల్లో ఆమనగల్లు పట్టణంలోని ఐదో వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహేష్ ను భారీ మెజార్టీతో గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. వార్డు పరిధిలో గడపగడపకు ప్రచారం నిర్వహించి ఈనెల 11న జరిగే పోలింగ్ లో చేతి గుర్తుపై ఓటు వేసి మహేష్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.గత రెండేళ్లుగా ఆమనగల్లు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వం పట్టణాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు కేటాయిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో వార్డు పరిధిలో అవసరం ఉన్న ప్రతిచోట సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అధికార పార్టీకి ఓటు వేసి గెలిపిస్తేనే నిధులు వస్తాయని వార్డు అభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. మహేష్ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డోకూరి ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ పోరులో బీఆర్ఎస్ జోరు

**ప్రచారం జోరు పెంచిన గులాబి అభ్యర్థులు**
**విస్తృత ప్రచారాలు... రోడ్ షో లు**



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ దూసుకుపోతుంది. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం టిఎఫ్సి చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఉప్పల వెంకటేష్,ఎన్నికల ఇంచార్జి రజిని సాయిచంద్ తనదైన శైలిలో ప్రచారంలో అన్ని పార్టీలకన్నా ముందున్నారు...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో పేద ప్రజలను నిండా ముంచిందని అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా గ్యారెంటీల అమలు ఊసే లేదని ఎద్దేవాచేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో గ్రామాలను పట్టించుకోలేదని,. మాజీమంత్రి కేసీఆర్ 10 ఏళ్ళ పాలనలో ఇంటింటికి మంచినీరు, 24 గంటల విద్యుత్, రెండు వందల ఫించన్ ను రూ.2 వేల కు పెంచిన ఘనత కేసీఆర్ అని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటిలు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500, ఆడబిడ్డకు ద్విచక్ర వాహనాలు, తులం బంగారం లాంటి ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అందరిని మోసం చేసారని విమర్శించారు. రెండేళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి చేసిన పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.....

## పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్

ఆదిలాబాద్ మహా : మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ కొనసాగుతున్న పోలింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్న తీరును పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సాగాలని ఆదేశించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ల భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని, ఓటింగ్ పూర్తైన తర్వాత వాటిని నిబంధనల మేరకు భద్రపరచాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ఎన్నికల నోడల్ అధికారి ఫణీందర్, మున్సిపల్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల కడుపు నింపే సన్న బియ్యం పథకాన్ని విస్మరించడం సరికాదు

**పథకాన్ని విమర్శిస్తే పేద ప్రజలను అవమానపర్చినట్టే.. మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డిపై మండిపడ్డ రమాకాంత్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పేదల కడుపు నింపే సన్న బియ్యం పథకాన్ని విస్మరించడం సరికాదని పథకాన్ని విమర్శిస్తే పేద ప్రజలను అవమాన పర్చినట్టేనని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాకాంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఆదివారం విలేకర్ల సమావేశంలో రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని విమర్శించడం అంటే రాష్ట్రంలోనీ పేద, మధ్యతరగతి ప్రజలను అవమానపరిచినట్టే అని అన్నారు... దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలలో ఏ రాష్ట్రంలో లేని విధంగా, మన తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని, ఏ మాత్రం అవగాహన లేకుండా మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి విమర్శించడం సిగ్గు చేటు అని,గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన దొడ్డు బియ్యంను ప్రజలు తినే పరిస్థితి లేదని, అందుకే ప్రతి పేదవాడికి కడుపు నింపాలి అనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డ్ ఉన్న ప్రతి కుటుంబనికి సన్నబియ్యము ఇవ్వడం ద్వారా పేదవాళ్లు కడుపునిండా తింటున్నారని అన్నారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి తన 15 ఏళ్ల పరిపాలనలో చేసింది ఏమీలేక, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో, అంధకారం లోకి తోసిండు అని అన్నారు.. ఇబ్రహీంపట్నం అభివృద్ధి ప్రదాత ప్రస్తుత ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డిపై విమర్శలు చేస్తే ప్రజలు హర్షించరు.. అధికారంలో ఉన్నప్పుడు చేయని అభివృద్ధిని బిఆర్ఎస్ వాళ్ళు ఇప్పుడు అధికారంలో లేకుండా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పడం హాస్యాస్పదం అని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా అవసరాలకు ఉపయోగపడే పథకాలతో ఆరు గ్యారెంటీలు ఒక పక్క అమలు చేస్తూ ఉంటే, ఇక్కడ మన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఇప్పటికే 220కోట్లు తీసుకొచ్చి అన్ని కాలనిలో ఒక యజ్ఞంలా పనులు చేయడం కూడా ప్రారంభిస్తే ఓర్వలేని విపక్ష పార్టీలు విమర్శలుచేయడం హాస్యాస్పదం.. అందుకే ఈ రోజు ప్రజలు ఆలోచించి బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా రాకుండా చిత్తుగా ఓడించి మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల అందర్నీ, మున్సిపాలిటీ ప్రజలు తమ అమూల్యమైన ఓటు చేతి గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించబోతున్నారని రంగారెడ్డి జిల్లా రాష్ట్ర నాయకులు బైరీక రమాకాంత్ రెడ్డి అన్నారు.



## శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానం ఈవోగా అద్దంకి నాగేశ్వరరావు

**ఈవో ను సత్కరించిన ఆలయ అర్చకులు**

**వరంగల్ మహా;** శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానం నందు నూతన కార్య నిర్వహణ అధికారిగా అద్దంకి నాగేశ్వరరావు ను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్చార్జి డీసి రామాల సునీత నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం గోవిందరాజస్వామి దేవస్థానం ఈవో గా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆలయానికి విచ్చేసిన కార్య నిర్వాహణాధికారి అద్దంకి నాగేశ్వరరావు ను శ్రీ గోవిందరాజస్వామి ప్రధానార్చకులు శ్రీ వరయోగుల శ్రీనివాస స్వామి, దేవస్థాన పాలకవర్గ సభ్యులు, వరియోగుల లక్ష్మణస్వామి తో కలిసి ఆలయ అర్చకులు వరయోగుల ప్రసాద్ స్వామి గోవిందరాజస్వామి గుట్ట పైకి సాదర స్వాగతం పలికి స్వామివారి దర్శనం తో పాటు ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించి మంగళా శాసనములు కావించడం జరిగింది.

# మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నకంది శ్రీనివాస రెడ్డి



- **కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి**
- **కాలనీలలో కంది శ్రీనివాస రెడ్డికి ఘన స్వాగతం**
- **ప్రచారానికి అనూహ్య స్పందన**

**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు. వార్డులలోని ఆయా కాలనీలలో కంది శ్రీనివాస రెడ్డికి స్థానిక నాయకులు కాలనీ వాసులు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఆయన నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తోంది. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 25,26, 27, 38, 46,47 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల తరుపున పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేపట్టారు. వార్డులలో అన్ని మౌలిక సదుపాయాలు కావాలన్నా, పట్టణం అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేసారు. త్వరలో మహిళలకు 2500 రూపాయల ఆర్థిక సాయం పథకం అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సంతోష్ రావు, కొండా గంగాధర్ ,లోక ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్, పత్తి ముజ్జు, దొగ్గలి రాజేశ్వర్, అజయ్, శ్రీలేఖ, ప్రశాంత్ , ఆయా వార్డుల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



## యెన్కెపల్లి 11వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా మద్యపాగు మహేష్

**మొయినాబాద్ మహా:** యెన్కెపల్లి గ్రామం 11వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా మద్యపాగు మహేష్ ఎన్నికల బరిలో నిలిచారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, తనకు ఒక అవకాశం ఇస్తే వార్డ్ను అభివృద్ధి చేసి చూపుతానని హామీ ఇచ్చారు.కళ్యాణ లక్ష్మి పథకం కింద అర్హులైన కుటుంబాలకు రూ.25,000 ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో అత్యవసర వైద్య అవసరాల కోసం ఉచిత అంబులెన్స్ సర్వీస్ ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. అలాగే ఇంట్లో జరిగే శుభకార్యాలకు టెంట్ హౌస్ సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తానని చెప్పారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతుకు ప్రతి ఏడాది రెండు బస్తాల ఎరువును ఉచితంగా అందించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. మహిళలు, యువత, వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా పని చేస్తానని పేర్కొన్నారు.ప్రజల ఆశీర్వాదంతో కౌన్సిలర్గా గెలిపిస్తే యెన్కెపల్లి 11వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని మద్యపాగు మహేష్ ధీమా వ్యక్తం చేశారు,

# ప్రచారంలో దూసుకు వెళ్తున్న రాగం శెట్టి సత్యనారాయణ



**బెల్లంపల్లి ,మహా:** ప్రజా సేవగా రాజకీయరామంలోకి ప్రవేశించి ఆటో డ్రైవర్ స్థాయి నుంచి రాజకీయాల్లోకి రంగ ప్రవేశం చేసిన రాగంశెట్టి సత్యనారాయణ అధిక సంఖ్యలో వార్డులోని ఓటర్లు గెలిపించేలా 17 వ వార్డు నుండి పోటీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.అధికార పార్టీ కాంగ్రెస్ అభ్యర్థిగా 17 అవార్డు నుండి ప్రచార హోరులో ముందుకు సాగి వెళ్తున్నారు. బెల్లంపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామంలో జన్మించి 25 ఏళ్ల క్రితమే షంషీనగర్ బస్తీలో నివాసం ఏర్పాటు చేసుకుని ప్రజాసేవ రంగంలో మునిగేందుకు ఆసక్తి కలిగి రియల్ ఎస్టేట్వ్యాపారాన్ని ఎంచుకొని ఆర్థికంగా బలపడినప్పటికీ ప్రజా సేవలో నిరంతరం తరిస్తున్నారు. ఈ క్రమంలో తన స్వగ్రామంలోని త్రిలింగేశ్వర ఆలయానికి పునర్వైభవాన్ని సిద్ధించేలా లక్షలాది రూపాయలు వెచ్చించి తను ఆర్జించిన ధనాన్ని వెచ్చించి ప్రజాసేవలో నిత్యం తరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న బల్దియా ఎన్నిక సమరంలో 17వ వార్డు అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచి ప్రచారంలో తనదైన శైలిలో దూసుకు వెళ్తున్నారు. ప్రజాసేవకై నిరంతరం తపించే తన వ్యక్తిత్వాన్ని ఆదరించాలంటూ సమస్యల పరిష్కారంలో కుటుంబ సభ్యుడిగా అందరికీ అండగా ఉంటారంటూ హామీయిస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ హయాంలో పదేళ్లలో వార్డులోని సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయంటూ తనను గెలిపిస్తే వార్డు పరిధిలోని స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, ప్రత్యేకంగా స్నానాలకు ఏర్పాటు, వార్డులలోని పలు విధులలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీని గాడిన పెడతానంటూ, అదే విధంగా రవీంద్ర నగర్ లో శాశ్వత ప్రాతిపదికగా సిసి రోడ్ల ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అంబేద్కర్ చౌరస్తా నుండి రవీంద్ర నగర్ కు వెళ్లే రోడ్డులో పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతినని హామీ ఇచ్చారు. ప్రజాసేవకే తపిస్తున్న తనను ఆదరించాలని ప్రచారంలో భాగంగా అభ్యర్థించారు. ఆర్థిక లబ్ధి కోసం కాకుండా ప్రజాసేవకు వస్తున్న తనను ఆదరిస్తే ప్రజాసేవలో తన మార్కు ఏమిటో చూపిస్తానని ప్రజలు అవకాశం ఇవ్వాలంటూ ప్రచారాన్నికొనసాగించారు

# గీతా కార్మికుల పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



**గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు పి రాములు డిమాండ్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్ర గీతా కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం కాలెండర్ ను ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో ముఖ్య అతిదులుగా హాజరై జిల్లా అధ్యక్షులు పి రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిఓ నెంబర్ 560 ప్రకారం వనసంరక్షణ చట్టం అమలు చేసి వెంచర్లలో తాటి చెట్లను, అక్రమంగా నరికి వేస్తున్న రియల్ ఎస్టేట్ దారులపై కఠిన చర్యలు తీసుకోనీ, ఈత, తాటి చెట్ల వనం పెంచుకోవటానికి 10 ఎకరాల భూమిని పంపిణీ చేయాలని, అలాగే గీతా కార్మికులకు రక్షణ కవచ్చాళ్లు, ద్విచక్ర వాహనాలు పంపిణీ చేసి, 12కోట్ల రూపాయల పెండింగ్ ఎక్సగ్రెషియా నిధులు విడుదల చేసి గీతా కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదిన జిల్లాలో మాజీ ఎంపీ, స్వతంత్ర సమర యోధులు, బొమ్మగాని ధర్మబిక్షం 104వ జయంతి ఉత్సవాల కార్యక్రమాలలో గీతా కార్మికులు అందరు పాల్గొన్ని విజయ వంతం చేయాలని పిలుపునించారు. గీతా కార్మికులు డి యాదయ్యగౌడ్, యాదగిరిగౌడ్, జంగయ్యగౌడ్, మహేష్ గౌడ్, మహేందర్ గౌడ్, కె మల్లేష్ గౌడ్, బి ప్రభాకర్ గౌడ్, బాలుగౌడ్ పాల్గొన్నారు.

# ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్న కాంగ్రెస్ పార్టీ




**రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్**

**రాజేంద్రనగర్, మహా :** చెవెళ్ల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం సోమవారం చివరి రోజు కావడంతో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఆదివారం చెవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం విజయవంతంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాంని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పార్టీ బీఆర్ఎస్ నెరవేర్చిందన్నారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టి విజయం అందిస్తారాని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సంక్షేమానికి అమలు చేసిన పథకాలను వివరించారు. ప్రజల నుంచి విశేషమైన స్పందన లభించింది. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు అందిస్తామని ప్రజలు హామీ ఇస్తున్నారు.ఈ కార్యక్రమంలో 14వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి తలారి యాదగిరి, పార్టీ నాయకులు రాజేందర్, వెంకట్ రెడ్డి, పరమేశ్వరి నరేందర్, హన్మంత్ ముదిరాజ్, గుంటి చరణ్, తదితరులు పాల్గొనారు.

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 09-02-2026



# భావ పరిమళం..!



ప్రతి మాటకు ఒక భావం మిళితమై
ఆ భావ పరిమళపు వికాసమే
వ్యక్తిత్వాన్ని నడిపే యంత్రం కావాలి
నా మాటగా మీ మాట తోడైతే
మీ మాటగా అందరి చైతన్యం
సమాజానికి హితువై పరిణమిస్తే
ఆ మాట విలువే వేరు

స్వార్థ చింతన చిక్కగా రంగరించి
తేనెలొలుకే మాటల మాయజాలంతో
ఆకట్టుకునే విన్యాసాల వలలో
ఎన్నో జీవన ప్రయాసలు
ఇంకెన్నో నష్టాల సుడిగుండాలు
ఇది కాదు మాటంటే

మాటంటే మనుగడ కావాలి
మాటంటే కొంత కాలం జీవించాలి
చక్కటి చైతన్యానికి చేయుత కావాలి

ఇది నా మాటే కాదు
మాటలో నమ్మికను కలబోసి
కమ్మని కర్తవ్యానికి శ్రీకారం చుట్టే
ప్రతి మనిషి మాట ఇదే సుమా..
హృదయాంతరంగంలో నుంచి
సద్భావనతో ముడిపడిపోతూ
లోకక్షేమం కోసం వచ్చే ప్రతి మాట
సుభిక్షతకు ప్రాణం వంటిదే
ఇదే నా మాట

- నరెద్దుల రాజారెడ్డి
96660 16636

# నీడల అడవి

## వంశీకృష్ణ

అడవి అనేది ఒక భౌగోళిక ప్రాంతం కాదు, అది ఒక వికృతమైన,విచిత్రమైన మానసిక స్థితి. అక్కడ చెట్లు గాలిని పీల్చవు, అవి ప్రాణవాయువు ముసుగులో ప్రాణాలను హరించే నిశ్శబ్దాన్ని విడుదల చేస్తాయి. ఆ అడవిలో ఒక చిన్న ఆకారం పుడుతుంది. దానికి పేరు పెట్టడం అంటే దానికి ఒక ఉనికిని ఇవ్వడమే, అందుకే అడవి దానికి పేరు పెట్టదు. మనం మాత్రం ఆ ఆకారానికి ఎలుక అని పేరు పెట్టుకుందాము. లేదా మీకిష్టమైన మరొక పేరు ఏదైనా పెట్టుకోవచ్చు. నా కేమీ అభ్యంతరం లేదు.

ఎలుకతన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూసినప్పుడు ,దానికి మొదట కనిపించేది వెలుగు కాదు. తనపై పడటానికి సిద్ధంగా ఉన్న ఒక భారీ నీడ. ఆ నీడలో తన తండ్రి భయం ఉంది, తన తల్లి అలసట ఉంది. అడవికి ఆకలి వేసిన ప్రతిసారీ ఆ ఎలుక వెన్నుముకలో ఒక వణుకు పుడుతుంది. ఆ వణుకే దానికి ప్రాణం ఉన్నట్లు ఇచ్చే ఏకైక సాక్ష్యం. భయం అంటే అక్కడ కేవలం ఒక భావం కాదు, అది ఒక ఆహారం. ఆ భయాన్ని తిని అడవిలోని పెద్ద నీడలు బలిసిపోతాయి.గర్వం తో అడవంతా కలయ తిరుగుతాయి.

ఆ పెద్ద నీడ వెనుక ఒక గర్జన వుంది. ఆ గర్జన వినిపించినప్పుడు ఎలుక తన ఆలోచనలను కరిగించుకుంటుంది. ఎందుకంటే ఆలోచించడం అంటే ప్రశ్నించడం, ప్రశ్నించడం అంటే మరణాన్ని ఆహ్వానించడం. అందుకే అది 'మర్చిపోవడం' అనే తెల్లటి ద్రవాన్ని తాగుతుంది. ఆ మత్తులో అది తన తోకను తానే ఒక పరాయి వస్తువులా చూస్తుంది. ఎలుక వెనుక ఉన్న నీడలు నిరంతరం నేలను తవ్వుతూ ఉంటాయి. అవి గింజల కోసం వెతకవు, అవి తమను తాము పూడ్చుకోవడానికి గోతులు తవ్వుకుంటాయి. వాటి కళ్లలో రేపు అనేది ఒక ఆశ కాదు, అది ఒక శిక్ష. ఎలుక ఎదుగుతుంటే ఆ నీడలు ఆనందించవు, తమ బదులు బలి ఇవ్వడానికి మరో శరీరం సిద్ధమవుతోందని ఊపిరి పీల్చుకుంటాయి. ఈ స్వార్థమే ఆ అడవిని నడిపించే ఇంధనం.

అడవిప్రతి క్షణం రంగులు మారుస్తుంది. అది ఎన్ని రంగులు మార్చినా ఒక రంగు మాత్రం మారదు. అది పచ్చదనం కాదు, అది కుళ్లిపోయిన వ్యవస్థల నుండి వచ్చే 'వాంతి రంగు'. ఆ రంగును పీల్చుకున్నప్పుడు ఎలుకకు తన బానిసత్వం ఒక శాంతిలా కనిపిస్తుంది. ఆ సమయంలోనే అడవి తన కన్ను మూసుకుంటుంది. ఆ మూసుకున్న కన్ను లోపల ఒక యంత్రం తయారవుతుంది. దాని పేరు న్యాయం. ఆ న్యాయం ఎప్పుడూ బలవంతుడి పంజాలో ఇరుక్కుపోయి ఉంటుంది. అది కేవలం వేగాన్ని మాత్రమే నమ్ముతుంది. ఎక్కడైతే ప్రతిఘటన లేని నిశ్శబ్దం ఉంటుందో, అక్కడ ఆ యంత్రం తన పనిని పూర్తి చేస్తుంది. ఎలుక తోక ఆ యంత్రానికి దొరికిన ఒక బలహీనమైన సాకు. ఆ తోక తెగిపోయినప్పుడు వచ్చే రక్తం అడవికి ఒక పండగ. ఆ రక్తంతోనే అడవి తన ముఖానికి రంగులు వేసుకుంటుంది.

ఆ సమయంలో పులి ఒక గుహ ముందు నిలబడి ఉపదేశం ఇస్తుంది. ఆ పులి మాటల్లో ధర్మం ఉంటుంది, నీతి ఉంటుంది, అడవి క్షేమం ఉంటుంది.అడవిలోని బలహీన జంతువుల సంక్షేమం ఉంటుంది. కానీ ఆ మాటల వెనుక ఉన్న పంజాలు ఎలుక గుండెలను చీలుస్తూ ఉంటాయి. పులికి ఎవరినీ వినవలసిన అవసరం లేదు, ఎందుకంటే శబ్దం చేసే అధికారం కేవలం పులికి మాత్రమే ఉంటుంది. ఎలుక చేసే ఏ చిన్నశబ్దమైనా సరే అది 'నేరం' కిందే లెక్క. పులి ఉపదేశం ఇస్తున్నప్పుడు గాలి కూడా భయంతో స్తంభించిపోతుంది. ఆ ప్రసంగంలో 'నైతికత' అనే పదం వినిపించిన ప్రతిసారీ, గుహ లోపల ఉన్న నక్కలు నవ్వుకుంటాయి. ఆ నైతికత కేవలం ఎలుకలు చావడానికి నిర్మించిన ఒక అందమైన వల మాత్రమే అని ఆ నక్కలకు బాగా తెలుసు.

యంత్రం తన ఎముకలను విరుస్తుంటే, ఎలుక గుహ వైపు చూస్తుంది. అక్కడ పులి ఉపదేశం ఇంకా వినిపిస్తూనే ఉంది. "త్యాగం పవిత్రమైనది" అని పులి అంటుంటే, ఎలుకకు నవ్వొస్తుంది. ఆ నవ్వు తన గొంతులో ఉబికిన రక్తం వల్ల పూడుకుపోతుంది. తను చనిపోతే అడవి మారుతుందని అది అనుకోవడం లేదు; తను చనిపోతే కేవలం పులి ఆకలి తీరుతుంది, నక్కకు ఒక విందు దొరుకుతుంది, తన వెనుక ఉన్న నీడలు మరో రోజు బతకడానికి ఒక సాకు దొరుకుతుంది. ఆ క్షణంలో దానికి అర్థమవుతుంది.

అడవికి తన చావు ముఖ్యం కాదు.
తన 'భయం' ముఖ్యం.

తను భయపడినంత కాలమే అడవికి బలం. తను కళ్లు మూసుకుంటే అడవి చీకటిగా మారుతుంది, తను శ్వాస ఆపితే అడవి నిశ్శబ్దమైపోతుంది. అంటే, ఈ అడవి మనుగడ తన భయం మీద ఆధారపడి ఉందన్నమాట!

చివరి క్షణంలో ఎలుకకు నొప్పి తెలియడం లేదు, కేవలం ఒక వింతైన స్పష్టత వస్తోంది. తన తోక యంత్రంలో ఇరుక్కున్నప్పుడు, అది తన రక్తం రంగును చూసి ఆశ్చర్యపోతుంది. ఇన్నాళ్లూ అది తాగిన తెల్లటి 'మర్చిపోవడం' వల్ల తన రక్తం కూడా తెల్లగా ఉంటుందని అది భ్రమపడింది. కానీ, తన రక్తం కూడా పులి రక్తం లాగే ఎర్రగా ఉందని చూసినప్పుడు, దానికి మొదటిసారి తన ఉనికి అర్థమవుతుంది.

ఆ ఎరుపు రంగులో తన పూర్వీకుల అరుపులు, తన నీడలు చేసిన త్యాగాలు, తను కోల్పోయిన కలలు అన్నీ ఒక మెరుపులా కనిపిస్తాయి. తన శరీరం విరిగిపోతుంటే, అది తన ప్రాణం కోసం ఏడవడం లేదు; ఇన్నాళ్లూ తనను తాను ఒక 'ఆహారం'గా మాత్రమే చూసుకున్నందుకు, ఒక 'పేరు లేని ఆకారం'గా మిగిలిపోయినందుకు తన మీద తనకే అసహ్యం వేస్తోంది.

చివరి శ్వాస వదులుతున్నప్పుడు, ఎలుకకు ఒక అద్భుతమైన కోరిక కలుగుతుంది. అది ఒకసారి గర్జించాలని అనుకుంటుంది. పులిలా కాదు, ఒక బాధితుడి ఆఖరి కేకలా కాదు... ఈ అడవిని నిద్రలేపే ఒక ధిక్కారంలా! కానీ దాని నోరు రక్తం గడ్డలతో నిండిపోయింది. దాని కళ్లు అడవిలోని పచ్చని ఆకులను చూస్తాయి, అవి ఇప్పుడు ఆకులుగా లేవు, రక్తం తాగే నాలుకల్లా ఉన్నాయి. ఎలుక తన కళ్లు మూసుకుంటూ ఒకే ఒక నిజాన్ని గ్రహిస్తుంది: అడవి తనను తినడం లేదు, అడవి తనను తనలో కలిపేసుకుంటోంది.

రేపు తను ఒక మట్టి గడ్డగా మారుతుంది, ఆ మట్టిలో ఒక చెట్టు పుడుతుంది, ఆ చెట్టు ఆకును ఇంకొక ఎలుక తింటుంది. ఈ విషవలయంలో విముక్తి లేదని, ఇదొక అంతం లేని నరకమని తెలుసుకున్నప్పుడు, ఎలుక మనసులో ఒక భయంకరమైన శాంతి ఏర్పడుతుంది. ఆ శాంతి పేరు 'మరణం' కాదు, అది 'జ్ఞానం'. కానీ ఆ జ్ఞానం అడవికి అవసరం లేదు. అడవికి కావలసింది కేవలం మరో కొత్త తోక.

మరణానికి ముందు ఎలుక చివరిసారిగా తన వెనుక ఉన్న నీడల వైపు చూస్తుంది. అవి ఇంకా నేలను కొరుకుతూనే ఉన్నాయి. వాటికి ఎలుక చనిపోతున్న బాధ కంటే, రేపు తమ పరిస్థితి ఏంటనే ఆందోళనే ఎక్కువగా ఉంది. అప్పుడు ఎలుకకు అనిపిస్తుంది. ఈఅడవిలో చనిపోయిన వాళ్ల కంటే, బతికి ఉన్న శవాలే ఎక్కువ ప్రమాదకరమని. తన చావు ఈ అడవికి ఒక కథను ఇస్తుంది, ఆ కథను వాడుకుని పులి మరో వేయి ఎలుకలను బలి ఇస్తుంది. తన ఉనికి ఒక మచ్చలా మిగిలిపోతుందని తెలుసుకుని, అది తన ఆఖరి చూపును శూన్యంలోకి విసిరేస్తుంది. ఆ శూన్యమే నిజం, మిగిలినదంతా అడవి ఆడుతున్న ఒక రక్తసిక్తమైన నాటకం.

సందేహం లేని చోట న్యాయం వెర్రితలలు వేస్తుంది. ఎలుక శరీరం నేలలో కలిసిపోతుంది, కానీ అడవి ఆకలి తీరదు. మళ్ళీ కాలం తిరుగుతుంది. మళ్ళీ అదే కథ, అదే గర్జన. అడవి ఎప్పుడూ ఏ పాఠమూ నేర్చుకోదు. నేర్చుకుంటే తనలోని క్రూరత్వాన్ని తాను భరించలేదు. అందుకే అడవి పరుగులు తీస్తుంది. పరుగు తీస్తూనే ఉంటుంది. అది పరుగునే దేవుడిగా నమ్ముతుంది. ఆ పరుగులో పాత రక్తపు గుర్తులు చెరిగిపోతాయి, కొత్త ఎలుకలు పుడతాయి. ఈ చక్రం ముగియదు. ముగింపు అంటే బాధ్యతను స్వీకరించడం. అడవికి బాధ్యతను స్వీకరించే ధైర్యం లేదు. అది తన అపరాధాన్ని 'అలంకారం'గా మార్చుకుని మళ్ళీ గర్జిస్తుంది

ఈ కథ చదువుతున్నప్పుడు మీకు ఏదైనా అసౌకర్యం కలిగితే, కలిగే ఆ అసౌకర్యమే అడవిలోని నిజమైన శబ్దం. అది మీ లోపల ఉంది, నా లోపల ఉంది. ఆ అడవి ఆగదు, ఎందుకంటే అది మన ఊపిరితోనే బతుకుతోంది.

ఈ కథ ఇక్కడితో ఆగిపోదు. అడవి మళ్ళీ శ్వాస పీలుస్తుంది.


# ఉత్తమ అనువాద కథా సంకలనం

స్వాతంత్ర్యానంతరం పత్రికలు, ప్రచురణ కర్తలు పెరిగినంత వేగంగా రచనలు రాకపోవడంతో, తప్పనిసరి అయి మనవాళ్లు అనువాదాల వైపుకు మొగ్గడం జరిగింది. అలా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన నవలలెన్నింటినో తెలుగులోకి తెచ్చారు. కమ్యూనిస్టుల ప్రచారంలో భాగంగా సోవియట్ సాహిత్యం తో పాటు, ఇతర భాషల విప్లవ సాహిత్యాన్ని తెలుగులోకి అనువదింప చేశారు. 1950 60 దశకాలు అనువాదాలకు స్వర్ణ యుగం లాంటివని చెప్పవచ్చు. తర్వాత కాలంలో నెమ్మదించినా ఇప్పుడిప్పుడే మళ్ళీ ఊపందుకుంటున్నది. గతంలో పత్రికలు తెలుగు కథలు దొరకకపోతేనే అనువాద కథలను ప్రచురించేవి. కానీ కేవలం అనువాద కథల కోసమే "విపుల" పత్రిక రావడం గొప్ప విషయం. దానివల్ల బోలెడు మంది అనువాదకులు తయారయ్యారు. అలాగే దేశ దేశాల కథారీతులను తెలుగు పాఠకుడు తెలుసుకోగలిగాడు.

ఇటీవల కాలంలో అనువాద కథా సంపుటాలు విరివిగా వెలుగులోకి రావడం ఆహ్వానించదగిన పరిణామం. అనువాదం కంటే ముందు, మంచి కథలను ఎంపిక చేసుకోవడం ముఖ్యం. అప్పుడే అనువాదకుడి శ్రమ, నిజాయితీ తెలుస్తుంది. చాలామంది అనువాదకులు సైజులో చిన్నగా ఉన్న కథలను, సింపుల్ గా ఉండి అనువాదానికి తేలికగా లొంగే కథలను ఎంపిక చేసుకుంటారు. అవి ఏ మేరకు పాఠకున్ని ఆకట్టుకుంటాయన్న విషయాన్ని పట్టించుకోరు. గతంలో ఎవరైనా చేశారా అన్న సంగతి చూసుకోకుండా, మళ్ళీ మళ్ళీ అవే కథలను అనువదించి డూప్లికేషన్ ను పెంచుతున్నారు. విదేశీ భాషల రచనలను ఆంగ్లం నుండి అనువదిస్తే ఒప్పుకోవచ్చు. కానీ మన పొరుగున ఉన్న భాషా కథలను, హిందీ లేదా ఇంగ్లీషు నుండి అనువదించడం ఎంతవరకు సబబు ? అనువాదాలకు సంబంధించి ఈ ప్రశ్నలు ఎప్పుడూ నన్ను తొలుస్తూనే ఉంటాయి.

ఈ నేపథ్యంలో నేను చదివిన వైవిధ్యభరితమైన అనువాద కథల సంకలనం "అక్రమ తుపాకులు". ఈ కథలను శ్రీనివాస్ తెప్పల తమిళం నుండి తెలుగులోకి అనువదించారు. వస్తురీత్యా, శిల్పరీత్యా వైవిధ్యభరితమైన కథలివి .ఇందులో ముందుగా నరన్ రాసిన మూడు కథలను చూద్దాం. వయోభారంతో శరీరమంతా పుచ్చిపోయి అనాధలా గిడ్డంగిలో పడి ఉన్న అతనికి మదర్ థెరిసా లా ,ఒక దేవతలా సేవలు చేసిన ఆమె వారిద్దరి మధ్య ఉన్న విచిత్రబంధాన్ని "కేశం" కథ తెలియజేస్తుంది." నీలం రంగు" కథలో, చర్చిలో వర్ణ చిత్రాలు గీసే ఏంజిలో తేలికగా ప్రేమకు వశమయ్యే వ్యక్తి. తాను ప్రేమించిన మగ ప్రేమికుల ముఖాలని దాదాపు బైబిల్లోని పాత్రలన్నింటికీ ఆపాదించి గీస్తుంటాడు. చర్చిని శుభ్రపరిచే లూసిని అనుభవించి, ఆమె కొడుకును కనడానికి కారణం అవుతాడు. అలా తాను గీసిన జోసెఫ్ ముఖం ఇంచుమించుగా ఏంజిలో తోను, మేరీ ముఖం లూసీ తోను, ఆమె పాపముఖం బాల యేసుతోనూ సరిపోతుంది. తాను అనుభవించిన దాన్నే కుంచెలోకి తీసుకోవడం ఆ చిత్రకారుడి ప్రత్యేకతగా మనం గుర్తించగలుగుతాం. మనం మాట్లాడకుండా ఉండలేం. ఆ మాటలకు ప్రతిస్పందన లేకపోతే మాట్లాడటమే అనవసరం. అందుకే అతను మాట్లాడే విషయాలను వినడానికి ఒక "మగువ చెవి" కావాలి. ఊ కొట్టేందుకు ఒక మగువ గొంతే కావాలని పరితపించిన వ్యక్తి ఈ కథలో కనిపిస్తారు. ఈ కథలు మనకు తెలియని కొత్త ప్రపంచాన్ని మన కళ్ళ ముందు ఆవిష్కరిస్తాయి. ఈ కథలు చదువుతుంటే ఏకకాలంలో జుగుప్స, ఆశ్చర్యం కలుగుతుంది.

జయమోహన్ రాసిన "కామ్రేడ్" కథలో ,జీపులో ఇద్దరు పోలీసులు, బంధింపబడి ఉన్న విప్లవకారుడ్ని అడవిలోకి తీసుకెళ్లి ఎన్కౌంటర్ చేసేస్తారు. ఆ ప్రయాణంలో పెత్తందారులు గ్రామీణుల మీద అఘాయిత్యాలు చేసి వాళ్లను తమ చెప్పు చేతుల్లో ఉంచుకొని సంఘవ్యతిరేక చర్యలకు ఉపయోగించుకోవడం, లొంగని వారిని అణిచేయడం, వారికి రక్షణగా నక్సలైట్లు, అక్కడకు శాంతి పేరిట అడుగుపెట్టిన పోలీసులు బోలెడు మందిని చంపడం తెలుస్తుంది. అలాగే విప్లవ పార్టీల్లో ఉన్న విభేదాలు, శత్రు వైరుధ్యాలుగా మారి ఒకరినొకరు చంపుకోవడం కూడా ప్రస్తావనకు వస్తుంది. ఈ కథ చదువుతుంటే చెరబండరాజు రాసిన "చిరంజీవి" కథ జ్ఞాపకం వస్తుంది. అయినా దాని నడక వేరు. దీని నడక వేరు. అత్యంత సహజంగా రూపొందిన ఈ కథ మనల్ని ఆలోచనలకు గురిచేస్తుంది. మిత్రులు "ఇద్దరూ కళాకా




రులు". ఒకరు కమ్యూనిజం నుండి పూర్తిగా వైదొలిగి భౌతిక వాదిగా మారినవారు. మరొకరు ఎగ్జిబిషనిస్టుగా కనిపిస్తారు. ఇద్దరి మనస్తత్వంలో ,వ్యక్తిత్వంలో ఉన్న పోలికలను ఈ కథలో వ్యక్తపరిచిన విధానం ఆకట్టుకుంటుంది. ఈ కథల నేపథ్యాన్ని పాఠకునికి దృశ్యమానం చేయడంలో రచయిత జయ మోహన్ చూపిన నేర్పు అద్వితీయం." ఇద్దరు కళాకారులు" కథను జాగ్రత్తగా చదివితే తప్ప రచయిత ఏం చెబుతున్నాడో అర్థం చేసుకోలేం.

దిలీప్ కుమార్ రాసిన కథలో, బోనులో చిక్కుకున్న ఒక ఎలుక తనకు ప్రాణభిక్ష పెట్టమని దేవుడిని వేడుకోవడంవీళ్లిద్దరి మధ్య జరిగే సంభాషణలలో జీవకారుణ్యం, రచయితల ఆరాటం, తమిళ సాహిత్యం మీద మంచి విసుర్లు ఉన్నాయి. ఎలుకను చంపడానికి బయలుదేరిన రచయిత, చివరకు తానే చనిపోయే దృశ్యంతో కథ ముగుస్తుంది. మ్యాజిక్ రియలిజం ధోరణిలో రాయడం వల్ల ఈ "ఒక ఎలుక జీవితం" అనే కథ బాగా వచ్చింది. ఎం.వి వెంకట్రాం రాసిన "పిచ్చి మారాజు" కథలో పదిమంది పిల్లలను పోషించలేని దారిద్రం, చనిపోయిన తండ్రి ,గయ్యాళిగా పిల్లలను కూడా వేధించే తల్లి, కష్టపడి సంపాదించిన డబ్బుతో పెళ్లి చేసుకోవాలనుకునే కొడుకు చివరకు విసిగిపోయి ఆత్మహత్యకు పాల్పడి జీవచ్ఛవంగా మారడం దయనీయంగా కొనసాగిన ఈ కథనం పాఠకున్ని కలవరపరుస్తుంది. చిన్నప్పటి నుండి మేనబావను ప్రేమించి, గుడ్డిగా ఆరాధించే మారియమ్మను పట్టించుకోకుండా, వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్న బావను అతని క్షేమం గురించి నిరంతరం తపించే మారియమ్మ కథనే" ఎండ పట్టున వెళ్లి". ఎస్ తమిళ్ సెల్వన్ రాసిన ఈ కథలో మారియమ్మ పిచ్చి ప్రేమ, అమాయకత్వం చూసి పాఠకులకు ఎక్కడలేని జాలి పుట్టుకు వస్తుంది. లక్ష్మీ శరవణ కుమార్ రాసిన "ఒక ఆకాశశకలం"లో రేస్ కోర్స్, గుర్రాలు, ట్రైనర్లు, జాకీలు, పందాలు వీటన్నింటి వెనక ఉన్న ఒక కొత్త ప్రపంచాన్ని ఈ కథ అందజేస్తుంది. జాకీకి గుర్రంతో, గుర్రానికి జాకీ తో ఉన్న అనుబంధాన్ని గొప్పగా చిత్రించారు. ఈ కథకు ముగింపు హైలెట్ గా నిలిచింది.

విజయ రావణన్ రాసిన "బోధిసత్వ" కథలో ,భర్తను కోల్పోయిన స్త్రీ ఒక ఏడాది తిరిగే లోపే అందుకు కారణమైన వ్యక్తిని అనూహ్యంగా పునర్వివాహం చేసుకోవడం కొడుకుకు కానీ, ఊళ్లో వాళ్లకు గాని నచ్చదు. ఆమె పేదరికమో, శారీరిక అవసరం కోసమో పెళ్లి చేసుకోలేదు. పెళ్లి చేసుకున్నవాడు వాళ్లతో ఉన్న ఒక్కొక్క రోజు, అపరాధ భావం ఒక చెదపురుగులా అతడి మనసును తొలచివేస్తూ ఉంటుంది. అతడు దాని నుండి బయటపడలేడు. ఆమె ముఖాన్ని దగ్గరగా చూసిన ప్రతిసారి తనలో తాను దహించుకుపోవడం చూసి సంతృప్తి పడటం ఆమెకే చెల్లుతుంది. ఇదో కొత్తరకమైన ప్రతీకారం. బుద్ధుడు తన పూర్వజన్మలలో కరుణ, త్యాగం, జ్ఞానం మరియు నైతికతను పాటిస్తూ బోధిసత్వుడిగా ఎలా జీవించాడో తెలిపే నీతి కథల నేపథ్యంలో ఈ కథ కొనసాగడం చాలా కొత్తగా ఉంటుంది. వీరు రాసిన ఇంకో కథ "మాట్లాడే టీ కప్పులు". ఇందులో మనకి సన్నిహితమైన వాళ్ళు చెప్పిన విషయాలు, పచ్చని జ్ఞాపకాలు, అంతెందుకు ఇష్టమైన మాటలు కూడా టీ కప్పుల్లో ఇంకా ఝుంకారం చేస్తూనే ఉంటాయి. మనమే వాటిని వినే ప్రయత్నం చెయ్యం అని చెబుతారు.


అశోక మిత్రన్ రాసిన "పిల్లి" కథలో, అతడి స్వాభావికమైన సాత్వికతకు, ఓర్పుకు ఒక పిల్లి భంగం కలిగిస్తుంది. దాని పీడ వదిలించుకోవడానికి ప్రయత్నించి, దాని దాడిలో అతనే మరణిస్తాడు. మూసి ఉన్న గదిలో కొడదామని చూస్తే, పిల్లి కూడా ఎదురు తిరుగుతుందని నిరూపించిన కథ ఇది. సెంథిల్ జగన్నాథం రాసిన "అనాహత నాదం" కథలో, తండ్రి మరణానంతరం వైద్యనాథన్ నాదస్వరం అభ్యసించేందుకు ప్రయత్నించిన సఫలం కాకపోవడంతో అవమానాలు, చివాట్లను, దెబ్బలను తినాల్సి వస్తుంది. చివరకు తన ఆత్మన్యూనతా భావాన్ని అధిగమించి, నాదస్వర విద్వాంసుడిగా మారిన పరిణామక్రమాన్ని చాలా చక్కగా చిత్రించారు. జి మురుగన్ రాసిన "అక్రమ తుపాకులు" లో, అడవిలోని మృగాలను చంపడం కోసం సుబ్రమణి తుపాకులను తయారుచేసి ఇచ్చాడు. దాంతో వాళ్లు మనుషులను చంపడం మొదలుపెట్టారు. దాంతో సుబ్రమణిని హంతకుడిగా భావించి వెతుక్కుంటూ వచ్చిన పోలీసోడు, ఆయన భార్యను చిత్రహింసలు పెట్టి చంపేస్తే, దాన్ని ఆయననెత్తికే చుట్టారు. అందరి నుండి తప్పించుకు తిరుగుతూ," అలసిపోయా, నన్ను పట్టుకెళ్ళండి, ఏమైనా చేయండి" అని సుబ్రమణి వేడుకుంటే, పట్టుకోవడానికి వచ్చిన పోలీసు వెళ్లిపోయి, సుబ్రమణి అనే వ్యక్తే లేడని చెప్పి కేసు క్లోజ్ చేస్తాడు. ఎస్ రాజేంద్రన్ కథ "నొప్పి వెంటాడే వేళలు" లో ,మురికివాడలో నివసించే వ్యక్తి మలవిసర్జన కోసం మరుగు దొరకక వెతుకుతూ చివరకు రైలు పట్టాల మీదకు పోయి దుర్మరణం చెందుతాడు. మన దేశంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి రైలు పట్టాలని ఆశ్రయించడం చాలా ప్రాంతాలలో జరుగుతూనే ఉన్నది. అలా వెళ్ళిన వారు అప్పుడప్పుడు ఎదుర్కొనే ప్రమాదాల గురించి మరో మారు ఈ కథ జ్ఞాపకం చేస్తుంది.

ఇందులో నరన్ రాసిన మూడు కథలు, జయ మోహన్ మరియు విజయ రావణన్ రాసిన రెండేసి కథలు, మిగిలిన 8 మందివి ఒక్కొక్క కథ చొప్పున తీసుకున్నారు. ఈ కథలు వస్తురీత్యా, శిల్పరీత్యా వైవిధ్యభరితమైనవి. మనం ఇంతకుముందు చదివిన రెగ్యులర్ కథల కంటే భిన్నంగా ఉంటాయి ఈ కథలు. వీటిలో తాత్వికత కొన్ని కథల్లో కనిపిస్తే, కొన్ని కొసమెరుపు కథలుగా కనిపిస్తే, మరికొన్ని కథలు అసంబద్ధ కథాకథన రీతిని సంతరించుకున్నాయి. మొత్తానికి ఇవి మనకు తెలియని సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. కథా వస్తువు, కథాగమనం, ముగింపు ఊహించని విధముగా కొనసాగి పాఠకుడిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. చాలా సీరియస్ గా, ఓపిగ్గా చదివితే తప్ప ఈ కథలు ఒక పట్టాన అర్థం కావు. ఇంత మంచి కథలను అందజేసిన అనువాదకుడి ఎంపికను, అనువాదాన్ని ప్రశంసించకుండా ఉండలేకపోతున్నాను.

- కె పి అశోక్ కుమార్
97000 00948

("అక్రమ తుపాకులు" తమిళ అనువాద కథలు. అనువాదం: శ్రీనివాస్ తెప్పల .ముద్రణ: బోధి ఫౌండేషన్., హైదరాబాద్. వెల 250 రూపాయలు. పేజీలు 184 ప్రతులకు: నవోదయ, న్యూ విశాలాంధ్ర ,లోగిలి ,అమెజాన్ డాట్ ఇన్)

# పాల మీగడ కోసం!



ఆ గొంతులో నిజాయితీ
అతని గుండెలో నిర్భీతి!
పద్నాలుగేళ్ల పసిప్రాయంలో
పరంపరాగత ప్రశ్నల ప్రభంజనం!!

దత్తాంశాలను దిట్టంగా సేకరించి
సాక్ష్యాలకు సరిగ్గా అన్వయించి!
పాలకులు పరిష్కరించని సమకాలీన
సమస్యలను
తుపాకీ తూటాల్లా సంధించిన తూర్పు
కిరణం!!

గీతా శ్లోకాలను ప్రవచించిన పాపానికి
గొల్ల పిల్లల పిలకలను కత్తిరించి
అందరి మిఠాయిని కొందరే ఆరగించడం
పౌరుల ప్రాథమిక హక్కులను
కాలరాసినట్లేనని!!

వాక్ స్వాతంత్ర్యం అనేది
వడ్డించిన విస్తరి కాదని!
పళ్ళెంలోని పాల మీగడ కోసం
ప్రాణాలొడ్డి పోరాడాల్సిందేనని.....!!

మౌలిక సంప్రదాయాలు .....
మార్పులను ససేమిరా అనుమతించవు!
వాటి పాదముద్రలు విడువక
పయనించాలని
నొక్కి వక్కాణిస్తాయి!!

పాతాళానికి తలుపులు తెరిచి
ప్రగతి పథాలకు పాడె కడతాయి!
విమర్శల జడివానకు వెరచి
ఇనుప సంకెళ్ళతో ఇరుకు గదుల్లోకి
నెడతాయి!!

ప్రశ్నించడం పరమనేరమని...
ప్రశ్నించిన సాహసానికి
శిక్షించడమే తమ ధ్యేయమని!
నిరంకుశాధికారాలు నీల్గుతాయి!!

ప్రశ్నించలేని పిరికిపందలు
ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం
స్పృహగల పౌరులుగా ప్రస్తుతమైనా
స్పందించాలని!
ఆ యువ కిశోరుని దృఢ సంకల్పం!!

(అశ్వమిత్ గౌతమ్ అనే మైనర్ అరెస్ట్ కు స్పందనగా)

-కరిపె రాజ్ కుమార్
81251 44729

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**.. మంచిర్యాల జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి, మహా:** మంచిర్యాల జిల్లాలో2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల ఎస్.ఎం. ఫంక్షన్ హాల్ లో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పి.ఓ., ఎ.పి.ఓ. లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిసిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ సంబంధిత ప్రతి నమూనాను పూర్తిగా నింపాలని, పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకుతావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహించినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్ల్ బ్యాలెట్ కేంద్రాన్ని సందర్శించి నమోదైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల మవిధులు నిర్వహించే ప్రతి ఒక్కరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. సి.సి. కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ఏవైనా గెలుపు కాంగ్రెస్ పార్టీదే

**టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి గడప గడప ప్రచారం**



**తొర్రూర్ మహా ;** ఎన్నికలు ఏవైనా గెలుపు కాంగ్రెస్ పార్టీదే అనిటిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 12వ వార్డులో ఝాన్సీరెడ్డి గడప గడపకు ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి కేతావత్ శ్రేయ ఓమేష్ ను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ ప్రచారం చేయడం జరిగింది. ఈ ప్రచారంలో ప్రజల నుండి విశేష స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ 12వ వార్డు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఆమె కోరారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా వార్డులో అనేక సమస్యలు నెలకొన్నాయని, ఆమె పేర్కొన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ప్రజలకు ఇచ్చిన హామీలను ఎన్ని అడ్డంకులు వచ్చినా నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఆమె తెలిపారు. దానిలో భాగంగానే ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు తెలంగాణ మహిళా మణులకు ఉచిత బస్సు సౌకర్యం, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, రైతు భరోసా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, సన్నాలకు 500 బోనస్ , రేషన్ కార్డ్ పేదలకు సన్న బియ్యం పంపిణీ, ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు వడ్డీ లేని రుణాలు, క్యాంటీన్లు అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అదేవిధంగా వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలను వార్డు కౌన్సిలర్ల గెలుపు అనంతరం ప్రత్యేక దృష్టి సరించి సమస్యలు పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కావున వార్డు ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను గుర్తించి కాంగ్రెస్ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించి, మున్సిపల్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి వెలుగు మహేశ్వరి అలువాల సోమయ్య కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలి

**ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి**

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా ;**ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటిస్తూ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సజావుగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద అన్నారు. రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు2026 లో భాగంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద వర్ధన్నపేట రైతు వేదికలో కౌంటింగ్ సూపర్వైజర్స్ కౌంటింగ్ అసిస్టెంట్ల కు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేందుకు కౌంటింగ్ సూపర్వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్ ప్రతి అంశంపైన సంపూర్ణంగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అనుసరించాల్సిన విధానం, లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్స్ ల ద్వారా పోలైన ఓట్ల లెక్కింపు ఏవిధంగా చేపట్టాలి, కౌంటింగ్ టేబుల్స్, రౌండ్లు వారిగా ఫలితాలు వెల్లడిలో కౌంటింగ్ సూపర్వైజర్స్ తిసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏజెంట్లు, అభ్యర్థులతో వ్యవహరించాల్సిన తీరు వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎటువంటి సందేహం వచ్చిన వెంటనే పై అధికారులను సంప్రదించాలని తెలిపారు. సిబ్బంది అందరూ ఐడి కార్డులు ధరించి ఫిబ్రవరి 13వ తారీకు ఉదయం 6 గంటల వరకు కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలని అన్నారు.కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు అందిన వారికే ఆర్వోలు ఏజెంట్లగా గుర్తింపు కార్డులు జారిచేయాలన్నారు. కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటు లెక్కింపులో ఖచ్చితత్వం పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.అదేవిధంగా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, సీబీసీడీఓ పుష్పలత, మునిసిపల్ కమిషనర్ సుధీర్ కుమార్, తహసీల్దార్ విజయ్ , ఎన్నికల అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మీ ఇంటి బిడ్డగా మరోసారి ఆశీర్వదించండి



**కారు గుర్తు అభ్యర్థి నసీరుద్దీన్**

**సంగారెడ్డి ప్రతినిధి : మహా :** పట్టణంలోని 4వ వార్డ్ ప్రజలు నన్ను మీ ఇంటి బిడ్డగా మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే వార్డ్అభివృద్ధి తో పాటు ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండి తన వంతు నిస్వార్థ సేవలు అందిస్తామని కారు గుర్తు అభ్యర్థి నసిరుద్దీన్ ఆదివారం భారీ జన సందోహంతో ప్రచారం నిర్వహించిన సందర్భంగా అన్నారు. వార్డు ప్రజలు ముక్తకంఠంతో నసీరుద్దీన్ కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని అంటున్నారు. గత ఐదు సంవత్సరాలలో వార్డుకు మూడు కోట్ల పనులతో అభివృద్ధి చేశానని వివరించారు. మరోసారి ఆశీర్వదిస్తే ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సహకారంతో, హరీష్ రావు ఆశీస్సులతో నాలుగో వార్డ్ పూర్తి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

# 10వ వార్డులో పెద్దపెల్లి ఎంపీ ప్రచారం

**పనస రాజయ్య గెలుపు ఖాయం.. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**క్యాతన్ పల్లి, మహా :** మంచిర్యాల జిల్లా క్యాతన్ పల్లి 10వ వార్డులో ఆదివారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ప్రచారం నిర్వహించారు. పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా 10వ వార్డులో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి విశేషమైన మద్దతు లభిస్తున్నదని తెలిపారు. పనస రాజయ్య ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే నాయకుడని, వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అతనికి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న తాగునీటి సమస్య,డ్రైనేజీ వ్యవస్థ,రోడ్ల అభివృద్ధి,పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారని పేర్కొన్నారు.అలాగే రానున్న కొద్ది రోజుల్లో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పేద కుటుంబాలకు మేలు చేశాయని వివరించారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు అందుతున్నాయని,సన్నబియ్యం అందుతున్నాయని చెప్పారు.

# అభివృద్ధి అజెండాతో దూసుకుపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్



**సంగారెడ్డి ప్రతినిధి :మహా :** సదాశివపేట మున్సిపల్ పట్టణంలోని ఎనిమిదవ వార్డ్కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాగునీరు, రహదారులు, కాలువలు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తానని , సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజల ఆశీర్వాదం కోరుతున్నారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ, అభివృద్ధికి తన ప్రణాళికలను వివరించడం తో పాటు ప్రజల సూచనలు స్వీకరిస్తున్నారు.

# విజయమే లక్షంగా ప్రచారం చెస్తున్న 26వ వార్డు బిజెపి అబ్యర్థి దుబుడం మమత సుదానంద



**సంగారెడ్డి ప్రతినిధి : మహా :** సదాశివపేట స్థానిక ఎన్నికల ప్రచారంలో బాగంగా ఆదివారమ్ నాడు సదాశివపేట 26వ వార్డు నుండి బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థి ధుబుడం మమత సుధానందం విజయమే లక్షంగా ప్రచారం చేస్తున్నారు .ప్రజల నుండి అనుహ్యామైన స్పందన లభించిందని అభ్యర్థి అన్నారు. వార్డు యొక్క అభివృద్ధియే తన లక్ష్యమని కేంద్ర ప్రబుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తోన్న క్రుషి వర్ణించలేనిదని అన్నారు.ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథాకలు అందుబా టు లోకి తీసుకొచ్చిందని నన్ను భారీ మెజారిటీ ఇచ్చి గెలించాలని వార్డు అభివృద్ధిలో ప్రజలు తోడ్పడాలని ఈ సందర్భంగా అన్నారు. దేశ అభివృద్ధియే ప్రజాల శ్రేయస్కరమణి అందుకే ప్రతి ఒక్కరు బిజెపి పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అన్నారు.అవినీతి పార్టీల మాయమాటలు నమ్మొద్దని గారడి చేసే నాయకుల వలలో పడవద్దని ఈ సందర్భంగా అన్నారు.

# భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలి

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వేములవాడ, మహా:**మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా వీఐపీ దర్శనాల కోసం చేసిన ప్రత్యేక ద్వారం, బారికేడింగ్ ను పరిశీలించి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయఈ.ఈ,రాజేస్,కుసూచనలు చేశారు...క్యూలైన్లు పరిశీలించి, నీటి సదుపాయం ఏర్పాట్లను సందర్శించి ఎక్కువ చోట్ల తాగునీటి పాయింట్లు పెట్టి భక్తులకు అందించాలని సూచించారు. అక్కడి నుంచి నూతన బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో స్వామివారి ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కళ్యాణకట్టను పరిశీలించి.. పలు సూచనలు చేశారు. మొబైల్టాయిలెట్లసంఖ్య మరింతపెంచాలనిఆదేశించారు...మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేసి.. జాతరను వైభవంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పార్కింగ్ స్థలం వద్దకోడెలటికెట్కౌంటర్,పందిర్లు,శివార్చనస్టేజీపరిశీలించారు... మహా శివరాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ రాధాభాయి, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు ఉన్నారు...

# ఇంటర్ పరీక్షల ఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య

**సైనిక్‌పురిలో విషాద ఘటన**



**కుషాయిగూడ, మహా :** ఇంటర్ పరీక్షల్లో గతంలో విఫలమైన నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడి, డిప్రెషన్కు లోనైన ఓ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సైనిక్‌పురి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైనిక్‌పురి మాధవపురి కాలనీలో నివాసం ఉంటున్న హృషిత (20) ఇంటర్ విద్యార్థిని కాగా, సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో విఫలమైంది. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతూ ఇంట్లోనే ఉండి చదువుకుంటోంది. ఈసారి ఉత్తీర్ణత సాధించాలని కుమార్తెకు తలిదండ్రులు సూచించారు. ఈ నెల 6వ తేదీ రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో హృషిత తన గదిలో చున్నీ సహాయంతో సీలింగ్ ఫ్యాన్కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు.

# తొర్రూరు మున్సిపాలిటీ పై కాషాయ జెండా ఎగురవేస్తాం



బిజెపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**తొర్రూర్ మహా ;** తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా ఈ రోజు తొర్రూరు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. స్థానిక ఆర్టీసీ డిపో దగ్గర నుండి మొదలై బస్టాండ్ మీదుగా అన్నారం రోడ్డు,సాయినగర్,దుబ్బ తండా అంబేద్కర్ సెంటర్, మున్సిపాలిటీ ఏరియా నుండి భీరప్ప నగర్,మేయిన్ రోడ్డు బీజేపీ పార్టీ ఆఫిస్ వరకూ బైక్ ర్యాలీ కొనసాగింది.ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీ పై కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ప్రజలతో మమేకమై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారని ప్రజల్లో బీజేపీ పట్ల సానుకూల దృక్పథం స్పష్టంగా కనిపిస్తోంది అని తెలిపారు.ఈఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.ఈర్యాలీలో బీజేపీ తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల సహా ఇంఛార్జి జలగం రంజిత్, వివిధ వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పూసాల రజితశ్రీమాన్, పల్లె కుమార్,తూర్పాటి సాయి ముకేష్, తూర్పాటి సారయ్య,పైండ్ల రాజేష్,గట్ల శ్రావణి భరత్, మంగళపల్లి యాకయ్య,గంధం శ్యామల రాజు,అలిసేరి సునితా రవిబాబు,జలగం రవి,కాగు నవీన్,రాయపురం సుష్మ రాజకుమార్,కాసోజు ఉమారాణి శ్రీనివాస్,చెన్నోజు శ్రీధేవి విజయ్ కుమార్,కొలుపుల శంకర్, నడిగడ్డ సందీప్ లతో పాటు భాగాల నవీన్ రెడ్డి,రంగు రాములు, రచ్చ కుమార్,నూనె అనిల్, గట్టు రాంబాబు,కట్టోజు భాస్కరా చారి,దుంపల సంపత్, రాపాక ప్రశాంత్,నిరంజన్ రెడ్డి,గడల శేఖర్,నూకల నవీన్, కొండా యాకన్న, పెండ్యాల గణేష్,శీలం శ్రీనాథ్,దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు జరిగే పరిధిలో బయటి వ్యక్తులు ఉండరాదు


**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**వరంగల్ హన్మకొండ మ హా ;** మున్సిపల్ ఎన్నికల సంబంధించి సోమవారం సాయంత్రం 5 గంటలకు ఎలక్షన్ ప్రచారం ముగుస్తుంది, తదుపరి ఆ పరిధిలో బయటి వ్యక్తులు ఎన్నికలు జరిగే ప్రాంతాలలో ఉండరాదని అలా ఉన్నట్లు అయితే వారి పై చర్యలు తప్పవని పోలీస్ కమీషనర్ తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే జనగామ, ఘన్పూర్, పరకాల,నర్సంపేట,వర్ధన్నపేట పట్టణాల్లో ప్రచారం రేపు సాయంత్రంతో ముగియనున్న నేపథ్యంలో, ఎన్నికల ప్రచారం నిమిత్తం బయటి ప్రాంతాల నుంచి వచ్చిన రాజకీయ పార్టీల నాయకులు , కార్యకర్తలు , ప్రచార సిబ్బంది తో పాటు ఇతరులు అందరూ తప్పనిసరిగా సోమవారం సాయంత్రం 5.00 గంటల లోపు తమ తమ గమ్యస్థానాలకు తిరిగి వెళ్లిపోవాలని వరంగల్ పోలీస్ కమీషనర్ తెలియజేయడమైనది. నిర్దేశిత సమయం అనంతరం కమిషనరేట్ పరిధిలో అనవసరంగా సంచరిస్తున్నట్లు గుర్తించినట్లయితే, సంబంధిత వ్యక్తుల పై ఎన్నికల నిబంధనలు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు రాజకీయ పార్టీలు పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు

# తొర్రూరును మోడల్ మున్సిపాలిటీ గా చేస్తాం

**అధికార పార్టీతోనే వార్డుల అభివృద్ధి సాధ్యం.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి**



**తొర్రూరు మహా ;** తొర్రూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలు స్పష్టం చేశారు.ఈ నెల 11న జరగనున్న తొర్రూరు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 9,12 వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పంజా కల్పన, కెతావత్ శ్రేయ ఓమేష్ గెలుపు కోసం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఅర్ఎస్ కు ఓట్లు వేసి గెలిపిస్తే ఆ పార్టీ అభివృద్ధిని గాలికి వదిలేసిందని తీవ్రంగా ధ్వజమెత్తారు.ఇప్పటికి అనేక శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయని, తమకు నచ్చిన పరాంతంలోనే వాళ్ళు సిమెంట్ రోడ్లు వేసుకుని వివక్ష పూరితంగా వ్యవహరించారని విమర్శించారు. వీటన్నింటిని సరిదిద్ది ,ప్రజల అందరికి అభివృద్ధిలో సమాన అవకాశాలను కల్పించాలంటే ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టాలన్నారు.ఐదేళ్ల క్రితం మున్సిపాలిటీలో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో వారు ఘోరంగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.నేటికీ పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక, సిమెంట్ రోడ్లు లేక ప్రజలు మట్టి రోడ్లపై నానా అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. అభివృద్ధి చేయని వారికి మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదని,ఈసారి బీఆర్ఎస్ కు ఓటేస్తే అభివృద్ధి ఐదేళ్లు వెనక్కి వెళ్తుందని అన్నారు.మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మున్సిపాలిటీని దత్తత తీసుకుని పట్టణ రూపురేఖలు మారుస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. మంత్రి దత్తత వల్ల మున్సిపాలిటీకి ప్రభుత్వ పరంగా భారీ ఎత్తున ప్రత్యేక నిధులు మంజూరవుతాయని,ఈ నిధులతో వార్డులన్నింటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.వీలైనంత త్వరగా మినీ ట్యాంక్ బండ్ నిర్మాణాన్ని వేగవంతం చేసి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇరుకు రోడ్లతో అల్లాడుతున్న ప్రజలకు ప్రధాన రహదారుల విస్తరణ చేపట్టడం, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంతో పట్టణ ప్రజలకు ప్రతిరోజూ మంచినీటి సరఫరా అందేలా చెయ్యడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తోందని, ఆ అభివృద్ధి ఫలాలు తొర్రూరుకు అందాలంటే "హస్తం" గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వరరావు, సిపిఐ నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు,కాంగ్రెస్ నాయకులు జీనుగ సురేందర్ రెడ్డి, వెంకట చారి,అలువాల సోమయ్య, జలీల్, వెలుగు మహేశ్వరి, జలగం రామ్మూర్తి, వెంకట్ రెడ్డి, చిదురాల రవి,మిట్టకోల లక్ష్మణ్ పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ ఫేజ్-1 లో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చే ప్రతి సమస్య పరిష్కారానికి తప్పకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా పేద ప్రజలకు అనుకూలంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారుత్వరలోనే మురికివాడల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నేరుగా తనను సంప్రదించాలని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నేమురి మహేష్ గౌడ్, బుచ్చన్న, శ్రీకాంత్ రెడ్డి, శివకుమార్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పాండాల శివకుమార్ గౌడ్, సోనియా గాంధీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిక్షపతి వంశరాజ్, గౌరవ అధ్యక్షుడు మైలారం బాల నరసింహ, సిద్ధులు, బంకు శ్రీను, గొల్లకిట్టు, టీడీపీ సీనియర్ నాయకులు రాముల యాదవ్, తాండ్ర యాదగిరి, కాలనీవాసులు తదితరులు హాజరయ్యారు.

# రూ. 270 కోట్ల మోసం

## వైట్ వాటర్ కన్‌స్ట్రక్షన్ సంస్థపై చీటింగ్ కేసు నమోదు

**హైదరాబాద్, మహా :** సొంతింటి కలను సాకారం చేస్తామని నమ్మించి కోట్లు కొల్లగొట్టి ప్రజలను మోసం చేస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ లో భారీ మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైట్ వాటర్ కన్స్ట్రక్షన్ సంస్థపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) కేసు నమోదు చేసింది. ఫ్లాట్లు నిర్మించి ఇస్తామని నమ్మించి సుమారు 500 మంది నుండి దాదాపు రూ. 270 కోట్ల రూపాయలు వసూలు చేసి, ఆపై మోసానికి పాల్పడినట్లు ప్రాథమిక ఫిర్యాదుల ద్వారా వెల్లడైంది. మూసాపేటకు చెందిన సుజాత అనే బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.గత పదేళ్లుగా ప్రాజెక్టు పేరుతో కాలయాపన చేస్తున్న ఈ సంస్థ, 2018లో వెంచర్ ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టలేదు. ఫిర్యాదుదారు సుజాత తన ఫ్లాట్ కోసం రూ. 80 లక్షలు చెల్లించగా, సదరు సంస్థ అదే ఫ్లాట్‌ను బ్యాంకులో రూ. 1.27 కోట్ల రుణానికి గిరవు పెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రాజెక్టులో కేవలం రెండు టవర్లు మాత్రమే కొంతమేర పూర్తి కాగా, మిగిలిన టవర్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, అసలు కొన్నింటి నిర్మాణం ప్రారంభమే కాలేదని బాధితులు వాపోతున్నారు.



పోలీసుల విచారణ కొనసాగుతోందని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ఈవోడబ్ల్యు అధికారులు తెలిపారు. ఒకే ఫ్లాట్‌ను ఒకరి కంటే ఎక్కువ మందికి అమ్మడం, గడువు ముగిసినా హ్యాండోవర్ చేయకపోవడం వంటి అక్రమాలపై ఇప్పటికే వందకు పైగా ఫిర్యాదులు పోలీసులకు అందాయి. దీనిపై స్పందించిన పోలీసులు సంస్థ యజమాని అజయ్‌తో పాటు మరి కొందరు డైరెక్టర్లపై బీఎన్ఎస్ సెక్షన్లు, తెలంగాణ డిపాజిటర్ల రక్షణ చట్టం కింద కేసులు నమోదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 318(4) మోసం, సెక్షన్ 316(2) నేరపూరిత కుట్ర, సెక్షన్ 316(5) నమ్మక ద్రోహం, తెలంగాణ డిపాజిటర్ల రక్షణ చట్టం సెక్షన్ 5 కింద కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఈ వెంచర్ 2018లో ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు కేవలం ఏ,బి టవర్స్‌లో నిర్మాణం కొంతమేర పూర్తి చేశారు. సి.డి టవర్ల బేస్‌మెంట్లు మాత్రమే పూర్తయ్యాయి. ప్రాజెక్టులో ఈ.ఎఫ్, టవర్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. రెరా నమోదు గడువు ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా, ఈ ఏడాది జూన్‌లో ముగియనుందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. డిసెంబర్ 2024, డిసెంబర్ 2025లో హ్యాండ్ ఓవర్ చేస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద నుంచి లక్షలు, కోట్ల రూపాయలు వసూలు చేసిన తర్వాత వాగ్దానాలు నెరవేర్చలేదని బాధితులు తెలిపారు.




# డిజిటల్ మీడియా నమ్మదగిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలి

**సమాచార కమిషన్ మాజీ చైర్మన్ విజయబాబు**

**విజయవాడ, మహా :** డిజిటల్ న్యూస్ మీడియా ఛానళ్లకు అవార్డులు అందజేయడం తెలుగు రాష్ట్రాలలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు కార్యక్రమం విజయవాడలోని హోటల్ లీలా గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ జర్నలిస్ట్, సమాచార కమిషన్ మాజీ చైర్మన్ పి. విజయబాబు, ఆంధ్ర అడ్వకేట్ ఫోరం కన్వీనర్ బి. అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డిజిటల్ మీడియా వేగవంతంగా సమాచారాన్ని అందించడమే కాకుండా ఖచ్చితమైన, నమ్మదగిన కంటెంట్‌ను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు.వార్తలను నిష్పాక్షికంగా, నిజానిజాలు నిర్ధారించుకున్న తరువాతే ప్రచురించాలని, ఫేక్ న్యూస్ వ్యాప్తిని అరికట్టడం అత్యంత అవసరమని తెలిపారు. సమాజంలో అలజడులు సృష్టించే లేదా విద్వేషాలను పెంచే వార్తలను డిజిటల్ మీడియా పూర్తిగా నివారించాలన్నారు.



# ఎలాన్ మస్క్ ఇడియట్ ఇండెక్స్



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తన వినూత్న వ్యాపార శైలితో మరోసారి వార్తల్లో నిలిచారు. క్లిష్టమైన పరిశ్రమలను సైతం అత్యంత వేగంగా, తక్కువ ఖర్చుతో నిర్వహించవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రాచుర్యంలోకి తెచ్చిన 'ఇడియట్ ఇండెక్స్' అనే భావన ఇప్పుడు పారిశ్రామిక వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### ఏమిటీ ఇడియట్ ఇండెక్స్?

ఇది అధికారిక ఆర్థిక గణాంకం కానప్పటికీ మస్క్ కంపెనీలైన టెస్లా, స్పేస్ ఎక్స్ పనితీరును నిర్దేశించే ఒక అనధికారిక కొలమానం. దీని ప్రకారం.. ఒక ఉత్పత్తిని తయారు చేయడానికి అయ్యే ముడి పదార్థాల మొత్తం ధర, ఆ ఉత్పత్తి విక్రయించే తుది ధర మధ్య వ్యత్యాసాన్నే మస్క్ 'ఇడియట్ ఇండెక్స్' అని పిలుస్తారు. ఉదాహరణకు ఒక యంత్రం తయారీకి వాడే ఉక్కు, అల్యూమినియం ఖర్చు చాలా తక్కువగా ఉండి తుది యంత్రం ధర విపరీతంగా ఎక్కువగా ఉంటే ఆ మధ్యలో ఉన్న వ్యత్యాసం వ్యవస్థలోని అసమర్థతను సూచిస్తుందని మస్క్ వాదిస్తున్నారు. ఇంజినీరింగ్ క్లిష్టత లేదా భద్రతా కారణాలు లేకుండా ఈ వ్యత్యాసం ఎక్కువగా ఉంటే అక్కడ వ్యవస్థలో లోపం ఉందని లేదా కాలం చెల్లిన పద్ధతులు వాడుతున్నారని ఆయన నమ్ముతున్నట్లు చెప్పారు.

### స్పేస్ ఎక్స్, ఎక్స్ఏఐ విలీనం

2026 ప్రారంభంలో మస్క్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయం వ్యాపార రంగంలో మైలురాయిగా నిలిచింది. తన కృత్రిమ మేధ సంస్థ ఎక్స్ఏఐని అంతరిక్ష పరిశోధనా సంస్థ స్పేస్ ఎక్స్‌లో విలీనం చేయడం ద్వారా ఆయన సాంకేతిక సమగ్రతను కొత్త స్థాయికి తీసుకెళ్లారు.

### ఈ విలీనం వెనుక కారణాలు

ఏఐ శిక్షణకు అవసరమైన భారీ విద్యుత్, డేటా కేంద్రాల నిర్వహణకు స్పేస్ ఎక్స్ స్టార్‌లింక్ నెట్‌వర్క్ తోడ్పడుతుంది. ఏఐ ఇంజినీర్లు, రాకెట్ శాస్త్రవేత్తలు ఒకే గొడుగు కింద పనిచేయడం వల్ల సంస్థాగత జాప్యం తగ్గుతుంది. బాహ్య సరఫరాదారులపై ఆధారపడకుండా ఏఐ నుంచి రాకెట్ తయారీ వరకు అంతా అంతర్గతంగానే నిర్వహించేందుకు వీలవుతుంది.

### విమర్శలు, వాస్తవాలు


మస్క్ పద్ధతులు ఎంత విజయవంతమైనా అవి విమర్శలకు అతీతం కాదు. ఉద్యోగులపై విపరీతమైన పని ఒత్తిడి, కఠినమైన టార్గెట్‌లు వంటి అంశాలపై మాజీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఫలితాల పరంగా చూస్తే స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్లు, టెస్లా గిగాఫ్యాక్టరీలు పారిశ్రామిక రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాయనడంలో సందేహం లేదు. మొత్తానికి 'ఇడియట్ ఇండెక్స్' ద్వారా అసమర్థతను తొలగించి వేగమే ప్రధానంగా మస్క్ తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నట్లు తెలుస్తుంది. 2026 నాటి ఈ పరిణామాలు భవిష్యత్తులో సాంకేతిక రంగం ఏ దిశగా వెళ్తుందో సూచిస్తున్నాయి.

## కరెన్సీ, బంగారం, వెండి భవిష్యత్తు ఇదే!



ప్రపంచంలో అత్యంత ప్రసిద్ధి చెందిన జ్యోతిష్కురాలు.. బాబా వంగా పేరు మరోసారి వార్తల్లో నిలిచారు. బాల్కన్ ప్రాంతపు నోస్ట్రడామస్ అని పిలువబడే ఈమె.. అనేక దేశాలు, ప్రముఖ వ్యక్తులు, ప్రపంచ పరిణామాలపై చెప్పిన మాటలు నిజమయ్యాయని ప్రజలు నమ్మడం వల్ల ఆమె పేరు ఇప్పటికే అంతర్జాతీయంగా ప్రఖ్యాతి పొందింది. ప్రపంచంలోని చాలా దేశాలు.. కరెన్సీ హెచ్చుతగ్గులు, ద్రవ్యోల్బణం వంటివి ఎదుర్కొంటున్నాయి. ఈ తరుణంలో బాబా వంగా ప్రపంచ ఆర్థిక సంక్షోభం గురించి చెప్పిన మాటలు చర్చకు దారితీసాయి. కాగితపు కరెన్సీ దాని విలువను కోల్పోతుంది. దీనివల్ల ప్రపంచంలో తీవ్రమైన నగదు కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీంతో ప్రజల్లో భయం, ఆందోళనను మొదలైపోయాయి. కరెన్సీకి ఎప్పుడైతే విలువ తగ్గిపోతుందో.. అలాంటి పరిస్థితుల్లో బంగారం, వెండి, రాగి వంటి లోహాలే భద్రమైన ఆస్తులుగా మిగులుతాయని, వాటి విలువ మరింత పెరుగుతుందని బాబా వంగా వెల్లడించారు. 2026 ప్రారంభమైన తరువాత బంగారం ధరలు అమాంతం పెరిగి తులం రేటు రూ.1.80 లక్షలకు చేరుకుంది. వెండి ధర రూ. 4 లక్షలకు చేరింది. గోల్డ్, సిల్వర్ రేట్లు ఇంతలా పెరగడం చరిత్రలో ఎప్పుడూ కనిపించలేదని ఆర్థిక నిపుణులు సైతం వెల్లడించారు. ఇప్పుడు పరిస్థితులు కొంత సాధారణ స్థితికి వచ్చేసాయి. దీంతో రేట్లు కూడా వరుసగా తగ్గుముఖం పట్టాయి. బాబా వంగా చెప్పిన మాటలు కేవలం అంచనా మాత్రమే. ఇవన్నీ తప్పకుండా జరుగుతాయని చెప్పలేము. కాబట్టి ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. కరెన్సీ విలువ తగ్గిపోతుందని భావించి, ముందుగానే బంగారం, వెండి వంటి వాటిలో ఇన్వెస్ట్ చేయాలనుకోవడం సరైంది కాదు. అయితే ఎక్కడైనా ఇన్వెస్ట్ చేసేటప్పుడు తప్పకుండా ఓసారి ఆలోచించాలి. ఎందుకంటే.. అన్ని వేళలా లాభాలే రావు, నష్టాలను కూడా కొన్ని సార్లు భరించాల్సి ఉంటుంది.

## కియోసాకీకి కోపమొచ్చింది!



'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకీ, తాను బిట్‌కాయిన్‌ను 6,000 డాలర్లకి కొనుగోలు చేశానన్న వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు స్పందించారు. బిట్‌కాయిన్ కొనుగోలు చేసిన తేదీపై అనవసరంగా దృష్టి పెట్టడం ఇన్వెస్టర్ల అసలు లక్ష్యాన్ని తప్పుదారి పట్టిస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో వరుస ట్వీట్లు చేశారు. తనను "అబద్ధం చెబుతున్నాడు" అంటూ ఆరోపించిన వ్యక్తి, బిట్‌కాయిన్‌ను ఏ తేదీన కొనుగోలు చేశానన్న అంశాన్ని ప్రశ్నిస్తున్నాడని కియోసాకీ పేర్కొన్నారు. అయితే తాను గుర్తుంచుకునేది కొనుగోలు చేసిన ధర మాత్రమేనని, తేదీ తనకు ప్రాధాన్యం కాదని చెప్పారు. "నేను ఏ తేదీన బిట్‌కాయిన్ కొన్నానో అతడికి ఎందుకు అంత ఆసక్తి?" అని ప్రశ్నించిన కియోసాకీ, ఆ విమర్శల వెనుక వ్యక్తిగత అజెండా ఉండవచ్చని ఆరోపించారు. బిట్‌కాయిన్ ధర మళ్లీ 6,000 డాలర్లకి పడితే మరోసారి కొనుగోలు చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఆ సమయంలో తేదీ ఏమిటన్నది తనకు ఎలాంటి ప్రాధాన్యం లేదన్నారు. ప్రస్తుతం తాను మరింత బంగారం కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్నానని కూడా వెల్లడించారు. తన విమర్శకులను ఉద్దేశించి, వారు ఎన్ని బిట్‌కాయిన్లు, బంగారం, వెండి లేదా ఈథీరియం కలిగి ఉన్నారో చెప్పాలని సవాలు విసిరారు. అలాగే అద్దె ఇళ్లు, చమురు బావులు వంటి వాస్తవ ఆస్తులపై కూడా ప్రశ్నించారు. "నేను ఈ ఆస్తులు ఎప్పుడు కొనుగోలు చేశానో నాకు గుర్తులేదు. కానీ వాటిని కొనుగోలు చేశానన్నది మాత్రం ఆనందంగా ఉంది" అని కియోసాకీ అన్నారు.అలాగే 2026 సంవత్సరానికి చెందిన 60 అమెరికన్ సిల్వర్ ఈగిల్స్ నాణేలు, 20 మిశ్రమ తేదీల గోల్డ్ ఈగిల్స్ కొనుగోలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. వెండి మార్కెట్‌లో ఉన్న కల్లోలం కారణంగా 2026 సిల్వర్ ఈగిల్స్ భవిష్యత్తులో కలెక్టర్ కాయిన్లుగా మారవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. చివరగా, తనను అనుసరించే ఇన్వెస్టర్లకు కియోసాకీ ఒక సూచన చేశారు. "ఆస్తి విలువ, సంఖ్య కంటే కొనుగోలు చేసిన తేదీలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తుల నుంచి దూరంగా ఉండండి. దీర్ఘకాలిక సంపద ఆస్తుల సేకరణతోనే వస్తుంది, తేదీలతో కాదు." అని ముగించారు.





## కాగ్నిజెంట్ ఉద్యోగులకు బొనాంజా.. 100% బోనస్

సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం కాగ్నిజెంట్ తన ఉద్యోగులకు 100 శాతం భారీ బోనస్ ప్రకటించింది. 2025లో అంచనాలను మించి ఆదాయ ఫలితాలను సాధించిన తరువాత ఈ బంపర్ బొనాంజా ప్రకటించింది. దీంతో ఉద్యోగుల్లో ఆనందోత్సాహం నిండింది.కాగ్నిజెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) రవి కుమార్ ఎస్ గత కొన్నేళ్లుగా "విజేత సర్కిల్"లోకి ప్రవేశించాలనే సంస్థ లక్ష్యం గురించి చాలాసార్లు మాట్లాడారు. ఫలితాల విడుదల సందర్భంగా 2025లో పటిష్ట పనితీరుకు కారణమైన 3.5 లక్షలమంది సిబ్బందిని సీఈవో ప్రశంసించారు. నాస్‌డాక్ లిస్టెడ్ కంపెనీ దేశీయంగా భారీ స్థాయిలో ఉద్యోగులను కలిగి ఉన్న విషయం విదితమే. డిసెంబర్31కల్లా కంపెనీ సిబ్బంది సంఖ్య 14,800 పెరిగి 3.51 లక్షలకు చేరింది.

**లాభం జూమ్**


కాగ్నిజెంట్ గత ఆర్థిక సంవత్సరం(2025) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం జంప్‌చేసి 64.8 కోట్ల డాలర్లను తాకింది. అంతక్రితం ఏడాది(2024) ఇదే కాలంలో కేవలం 54.6 కోట్ల డాలర్లు ఆర్జించింది. కంపెనీ కేలండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. మొత్తం ఆదాయం సైతం 5 శాతం ఎగసి 533.3 కోట్ల డాలర్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో 508.2 కోట్ల డాలర్ల టర్నోవర్ అందుకుంది. ఈ కాలంలో 12 భారీ డీల్స్ కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. డిసెంబర్‌తో ముగిసిన పూర్తిఏడాది(2025)కి ఆదాయం 7 శాతం వృద్ధితో 21.1 బిలియన్ డాలర్లను తాకింది. ప్రస్తుత ఏడాది(2026)కి కాగ్నిజెంట్ 5-7.4 శాతం అధికంగా 22.14-22.66 బిలియన్ డాలర్ల ఆదాయ అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. ఈ బాటలో తొలి క్వార్టర్(జనవరి-మార్చి)కు 5.36-5.44 బిలియన్ డాలర్ల ఆదాయం ఆశిస్తున్నట్లు తెలియజేసింది. 2.7-4.2 శాతం వృద్ధి అంచనాలివి.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## ఉగ్రవాదంపై రాజీ లేదు.. ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదు



కౌలాలంపూర్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతం మలేషియా పర్యటనలో ఉన్నారు. ఆదివారం ఆయన ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో 'పుత్రజయ'లో కీలక భేటీ నిర్వహించారు. రక్షణ, భద్రత, ఆర్థిక రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ అంతర్జాతీయ వేదికపై మరోసారి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించారు. 'ఉగ్రవాదం విషయంలో మా సందేశం చాలా స్పష్టం.. ఇందులో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు, రాజీ పడే ప్రసక్తే లేదు' అని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరులో ఇరు దేశాలు పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని, భద్రతా పరమైన సహకారాన్ని పెంచుకోవాలని అన్నారు. ఇండోపసిఫిక్ ప్రాంతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంజిన్‌గా మారుతున్నదని, ఆసియా దేశాల (ASEAN) సహకారంతో ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాల కోసం భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న సముద్ర తీర సంబంధాలను, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత్ వెలుపల అత్యధికంగా భారత సంతతి ప్రజలు నివసిస్తున్న రెండో దేశం మలేషియా అని పేర్కొంటూ, ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని ఆయన గుర్తు చేశారు. కాగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు. రక్షణ రంగంలో సహకారాన్ని కేవలం కొనుగోళ్లకే పరిమితం చేయకుండా, సమగ్రంగా మార్చాలని మోదీ పిలుపునిచ్చారు. సెమీకండక్టర్లు, ఆరోగ్యం, ఆహార భద్రత తదితర కీలక రంగాలలో సరికొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని నిర్ణయించారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులు, కనెక్టివిటీ రంగాల్లో భారత్ సాధిస్తున్న వృద్ధిని అభినందించారు. శనివారం కౌలాలంపూర్ చేరుకున్న ప్రధాని మోదీకి మలేషియా ప్రభుత్వం అపూర్వ స్వాగతం పలికింది. విమానాశ్రయంలో ప్రధాని అన్వర్ ఇబ్రహీం స్వయంగా మోదీని ఆహ్వానించడం విశేషం. ఆదివారం ఉదయం పెర్దానా పుత్రలో ప్రధానికి ఘనంగా గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) సమర్పించారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య నాగరికత, చారిత్రక,ప్రజల మధ్య ఉన్న సంబంధాలను మరింత దృఢ పరుస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.


## ఓపెన్ ఏఐ మరో షాక్..
# ఇక స్మార్ట్ ఫోన్‌లకు చెక్!

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తన నూతన ఆవిష్కరణలతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా దూసుకుపోతోంది. ఇప్పటివరకూ సాఫ్ట్‌వేర్ వరకే పరిమితమైందనుకుంటున్న ఓపెన్ ఏఐ ఇప్పుడు హార్డ్‌వేర్ రంగంలోకీ గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. 'డైమ్' అనే కోడ్ నేమ్‌తో కంపెనీ తన మొట్టమొదటి హార్డ్‌వేర్ ఉత్పత్తిగా ఏఐ ఆధారిత ఇయర్‌బడ్స్‌ను తీసుకురానున్నట్లు 'మింట్'తన కథనంలో పేర్కొంది.**




'డైమ్' ఇయర్ బడ్స్ కేవలం సంగీతం వినడానికే పరిమితం కాకుండా, వాయిస్ కమాండ్స్ ద్వారా ఏఐ మోడళ్లను నియంత్రించేలా, హ్యాండ్స్‌ఫ్రీ అసిస్టెన్స్‌ను అందించేలా రూపొందించారు. ఈ ఏడాది చివరిలో వీటిని ప్రపంచానికి పరిచయం చేసి, 2027 ప్రారంభంలో మార్కెట్లోకి వీటిని విడుదల చేసే అవకాశం ఉంది. 'స్మార్ట్ పికాచు' అందించిన సమాచారం ప్రకారం చైనాలో ఇటీవల దాఖలైన ఒక పేటెంట్ ఫైలింగ్‌లో 'డైమ్' అనే పేరు వెలుగులోకి వచ్చింది. భారీ స్థాయిలో హార్డ్‌వేర్ పరికరాలను నేరుగా మార్కెట్లోకి తెచ్చే కంటే, వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ఇయర్‌బడ్స్ లాంటి సాధారణ పరికరంతో రంగప్రవేశం చేయాలని ఓపెన్ ఏఐ భావిస్తోంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక ఇబ్బందులు లేకుండా హార్డ్‌వేర్ మార్కెట్‌ను చేజిక్కించుకోవడమే కంపెనీ వ్యూహమని తెలుస్తోంది. ఇవి వాయిస్ ఇంటరాక్షన్లపై దృష్టి సారిస్తూ, వినియోగదారులకు రియల్ టైమ్ ఏఐ సేవలను నేరుగా చెవి దగ్గరికే చేర్చనున్నాయి.గతంలో ఓపెన్ ఏఐ స్మార్ట్ ఫోన్ తరహాలో ఉండే శక్తివంతమైన ఏఐ డివైజ్‌ను తీసుకువస్తుందనే ప్రచారం జరిగింది. అయితే హై బ్యాండ్‌విడ్త్ మెమరీ (హెచ్‌బీఎం)కొరత కారణంగా విడిభాగాల ధరలు విపరీతంగా పెరగడంతో ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం వాయిదా పడినట్లు సమాచారం. తయారీ వ్యయం కారణంగా కంపెనీ ప్రస్తుతానికి తన నిర్ణయాన్ని మార్చుకుని, 2026లో సరళమైన వెర్షన్ (డైమ్ ఇయర్‌బడ్స్)ను లాంచ్ చేయాలని నిశ్చయించుకుందని సమాచారం. ఓపెన్ ఏఐ చీఫ్ గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ క్రిస్ లెహనే గతంలోనే కంపెనీ తొలి హార్డ్‌వేర్ ఉత్పత్తిపై పనిచేస్తున్నట్లు ప్రకటించారు. అయితే అప్పట్లో దాని ఆకారం లేదా ఫీచర్ల గురించి ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ ఏడాదిలోనే ఆ పరికరాన్ని ఆవిష్కరిస్తామని ఆయన పేర్కొన్నప్పటికీ, లాంచ్ తేదీని వెల్లడించలేదు. ప్రస్తుతం 'డైమ్' బ్రాండింగ్‌తో వస్తున్న ఇయర్‌బడ్స్ వార్తలపై ఓపెన్ ఏఐ ఇంకా స్పందించాల్సి ఉంది. ఆపిల్ మాజీ డిజైన్ హెడ్ జోనీ ఐవ్ నేతృత్వంలో ఈ నూతన పరికరాలు రూపుదిద్దుకుంటున్నాయనే వార్తలు టెక్ ప్రపంచంలో సంచలనంగా మారాయి. కాగా డైమ్ ఇయర్‌బడ్స్ అందుబాటులోకి వస్తే, అవి స్మార్ట్ ఫోన్ల వినియోగానికి చెక్ పెట్టనున్నాయనే వాదన వినిపిస్తోంది.

## వాషింగ్టన్ పోస్ట్‌లో మరో సంచలనం



**వాషింగ్టన్:** ప్రముఖ అంతర్జాతీయ దినపత్రిక 'ది వాషింగ్టన్ పోస్ట్' పబ్లిషర్, సీఈఓ విల్ లూయిస్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పత్రికలో దాదాపు మూడొంతుల మంది సిబ్బందిని, అంటే సుమారు 300 మంది జర్నలిస్టులను తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్న మూడు రోజుల అనంతరం లూయిస్ తప్పుకోవడం మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా నిలిచింది. సంస్థలో రెండేళ్ల పాటు సాగిన సమూల మార్పుల ప్రక్రియ తర్వాత 'తాను పక్కకు తప్పుకోవడానికి ఇదే సరైన సమయం' అని లూయిస్ తన ఉద్యోగులకు పంపిన ఇమెయిల్‌లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో ప్రస్తుత చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) జెఫ్ డి ఒనోఫ్రియో తాత్కాలిక పబ్లిషర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ వారం ప్రారంభంలో వాషింగ్టన్ పోస్ట్ ప్రకటించిన వివాదాస్పద వ్యయ నియంత్రణ చర్యలు సంస్థలో ప్రకంపనలు సృష్టించాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థలో పనిచేస్తున్న 300 మందికి పైగా జర్నలిస్టులను తొలగించడమే కాకుండా, క్రీడలు, పుస్తక విభాగాలను కూడా పత్రిక మూసివేసింది. దీనితో పాటు ఆసియాతో పాటు పలు విదేశీ బ్యూరోలకు తాళం వేశారు. గత కొన్నేళ్లుగా పత్రిక చందాదారుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం, ప్రతిభావంతులైన జర్నలిస్టులు సంస్థను వీడటంతో, పత్రిక భవిష్యత్తును కాపాడటానికి ఇటువంటి కఠిన నిర్ణయాలు తప్ప లేదని లూయిస్ తన వీడ్కోలు లేఖలో పేర్కొన్నారు. జనవరి 2024లో బాధ్యతలు చేపట్టిన విల్ లూయిస్ పదవీకాలం ఆద్యంతం వివాదాలతోనే సాగింది. బ్రిటన్‌లో జర్నలిస్టుగా ఉన్న సమయంలో సమాచారం కోసం డబ్బులు చెల్లించారనే నైతికపరమైన ఆరోపణలు ఆయనను వెంటాడాయి. అలాగే పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సాలీ బజ్బీ నిష్క్రమణకు ఆయన నాయకత్వమే కారణమనే విమర్శలు వినిపించాయి. లూయిస్ నిష్క్రమణపై స్పందించిన వాషింగ్టన్ పోస్ట్ గిల్డ్ (యూనియన్), ఆయన రాజీనామా ఎప్పుడో జరగాల్సిందని, ఒక గొప్ప జర్నలిజం సంస్థను నాశనం చేశారని ఘాటుగా విమర్శించింది.ఈ భారీ లేఆఫ్స్ ప్రభావం భారతీయ జర్నలిస్టులపై కూడా పడింది. ప్రముఖ కాంగ్రెస్ నేత శశి థరూర్ కుమారుడు ఇషాన్ థరూర్, అలాగే ఢిల్లీ బ్యూరో చీఫ్ ప్రాన్షు వర్మ వంటి వారు తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఇషాన్ థరూర్ అంతర్జాతీయ రాజకీయాలపై రాసే ప్రసిద్ధ న్యూస్‌లెటర్ నిలిచిపోయింది. ఫోటోగ్రఫీ విభాగాన్ని పూర్తిగా రద్దు చేయడం, మెట్రో, అంతర్జాతీయ వార్తల కవరేజీని తగ్గించడం లాంటి నిర్ణయాలు పత్రిక ప్రాభవాన్ని దిగజార్చాయని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.

## పాకిస్తాన్‌లో దాడి.. ఐఎస్ సంచలన ప్రకటన

ఇస్లామాబాద్: పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో షియాలకు చెందిన మసీదులో శుక్రవారం జరిగిన భారీ ఆత్మాహుడి దాడికి తామే కారణమని ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)శనివారం ప్రకటించుకుంది. ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోగా, 169 మంది గాయపడటం తెల్సిందే. తమ బాంబర్‌ను మసీదు వద్ద భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో, వారిపైకి కాల్పులు జరిపి లోపలున్న వారికి సమీపంలోకి వెళ్లి పేల్చేసుకున్నాడని తెలిపింది. ఇదే సమయంలో సిరియాలో షియా సాయుధ గ్రూపులకు పాకిస్తాన్ మానవ వనరుగా మారిందని, ఇక్కడి నుంచే రిక్రూట్లు జరుగుతున్నాయని ఆరోపించింది. అందుకే తాము పాకిస్తాన్‌లోని షియాలను లక్ష్యంగా చేసుకుంటున్నామని తెలిపింది. ఇలా ఉండగా, శుక్రవారం నాటి ఆత్మాహుతి దాడికి కీలక సూత్రధారి సహా నలుగురిని ఖైబర్ ప్రావిన్స్‌లోని పెషావర్, నౌషేరాల్లో అరెస్ట్ చేసినట్లు పాక్ అధికారులు తెలిపారు. ఘటనాస్థలిలో లభ్యమైన గుర్తింపు కార్డు ఆధారంగా ఆత్మాహుతి బాంబర్‌ను పెషావర్‌కు చెందిన యాసిర్‌గా గుర్తించామన్నారు. ఇతడు ఐదు నెలలపాటు అఫ్గానిస్తాన్‌లో ఉండి ఆయుధాల వినియోగంతోపాటు ఆత్మాహుతి దాడులకు శిక్షణ తీసుకున్నాడన్నారు.







# పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌కు భారీ హైప్ ప్లాన్!

సినిమా ఇండస్ట్రీ అనగానే ప్రేక్షకులకు మొదట గుర్తుకు వచ్చేది స్టార్ హీరోలే. ఎందుకంటే వారి ఇమేజ్, ఫ్యాన్ బేస్, మార్కెట్ వల్లే సినిమాలు భారీ ఓపెనింగ్స్ సాధిస్తాయి. ఒక స్టార్ హీరో సినిమా విడుదల అంటే అది కేవలం ఒక సినిమా కాకుండా ఒక ఈవెంట్‌లా మారిపోతుంది. అటువంటి స్టార్ హీరోల్లో టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ముందువరుసలో ఉంటాడు. సూపర్ స్టార్ కృష్ణ వారసుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన మహేష్ బాబు, తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, వరుస విజయాలతో అగ్రహీరోగా ఎదిగాడు. మహేష్ బాబు వ్యక్తిత్వం పరంగా చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటాడనే పేరు ఉంది. ఎలాంటి వివాదాల్లోనూ ఇరుక్కోకపోవడం, ఎవరిపై కూడా విమర్శలు చేయకపోవడం ఆయన ప్రత్యేకత. సినిమా ఫంక్షన్లకు హాజరైనప్పుడు కూడా చాలా సింపుల్‌గా మాట్లాడి, తన సినిమాకే పరిమితమయ్యే స్వభావం కలిగిన హీరోగా గుర్తింపు పొందాడు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నట్లు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం మహేష్ బాబు దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళితో భారీ ప్రాజెక్ట్‌లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా మీద ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. దాదాపు 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ వరల్డ్ స్థాయిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్ విషయంలో రాజమౌళి ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నట్లు టాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. ఇటీవల వారణాసి నేపథ్యంలో రూపొందించిన గ్లింప్స్ రిలీజ్ ఈవెంట్‌లో మహేష్ బాబు చాలా సింపుల్‌గా హాజరుకావాలని భావించాడట. కానీ రాజమౌళి మాత్రం ఈ ఈవెంట్‌ను ఒక విజువల్ స్పెక్టకిల్‌లా రూపొందించేందుకు ముందుగానే పూర్తి ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. మహేష్ బాబు డ్రెస్సింగ్ స్టైల్ నుంచి స్టేజ్ ఎంట్రీ వరకు ప్రతీ అంశాన్ని రాజమౌళి టీమ్ డిజైన్ చేసినట్లు సమాచారం. చివరికి మహేష్ బాబు కూడా ఆ ప్లాన్‌నే అనుసరించాడని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

రాజమౌళి సినిమాలంటే కేవలం కథ, టెక్నికల్ విలువలే కాదు, ప్రమోషన్స్ కూడా ఓ ప్రత్యేక బ్రాండ్‌గా మారాయి. "బాహుబలి", "ఆర్ఆర్ఆర్" చిత్రాల సమయంలో ఆయన అమలు చేసిన ప్రమోషనల్ స్ట్రాటజీలు ఎలా పనిచేశాయో తెలిసిందే. ఇప్పుడు మహేష్ బాబు ప్రాజెక్ట్ విషయంలో కూడా అదే ఫార్ములాను మరింత గ్రాండ్‌గా అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. సినిమా రిలీజ్ వరకు ఇంకా ఎన్నో ఈవెంట్స్, గ్లోబల్ ప్రమోషన్స్ ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇక మహేష్ బాబు కూడా తన కంఫర్ట్ జోన్‌ను దాటి, ఈ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ కోసం కొత్తగా మారుతున్నాడని అభిమానులు భావిస్తున్నారు. రాజమౌళి విజన్, మహేష్ బాబు స్టార్ పవర్ కలిస్తే ఈ సినిమా ఇండియన్ సినిమా హిస్టరీలో కొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందనే అంచనాలు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రస్తుతం రాజమౌళి దేశంలోనే నెంబర్ వన్ దర్శకుడిగా గుర్తింపు పొందగా, ఈ సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో తన సత్తా చాటాలని చూస్తున్నాడు.

# నాగ్ పంపిణీ రంగంలో తొలిస్టార్...



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున మరో రంగంలోనూ సత్తా చాటనున్నారు. అగ్రస్థాయి నటుడుగా, చిన్నితెర పై టాప్ హోస్ట్‌గా, నిర్మాత, స్టూడియో అధినేత... వంటి బహుముఖ పాత్రలతో రాణిస్తున్న నాగ్... ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో సినిమా పంపిణీదారుగా కూడా కొత్త పాత్ర పోషించనున్నారు. పరిశ్రమ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఆయన సినీ పంపిణీ రంగంలోకి లాంఛనంగా అడుగుపెట్టారు, రాబోయే సంవత్సరాల్లో తన పంపిణీ సామ్రాజ్యాన్ని గణనీయంగా విస్తరించాలని యోచిస్తున్నారు.

### బాలీవుడ్ బాటలో...

ప్రస్తుతం తెలుగు హీరోలలో ఎవరూ పంపిణీ రంగంలో లేని పరిస్థితుల్లో.. ఈ రంగంలోకి దిగిన తొలి తెలుగు హీరోగా నాగార్జున నిలవనున్నారు. బాలీవుడ్ లో చూస్తే రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ పేరిట షారూఖ్‌ఖాన్, అమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, అజయ్ దేవగణ్, అక్షయ్ కుమార్, దక్షిణాది హీరోల్లో రాజ్ కమల్ ఫిలింమ్స్ ఇంటర్నేషనల్ పేరిట కమల్ హాసన్, మమ్ముట్టి, మోహన్‌లాల్...వంటివారు పంపిణీ రంగంలో ఉన్నారు. ఈ హీరోలు ముఖ్యంగా బాలీవుడ్ హీరోల స్ఫూర్తితోనే నాగార్జున ఈ నిర్ణయం తీసుకున్నారని అనుకోవచ్చు. తెరపై పాత్రల ఎంపిక విషయంలో మాత్రమే కాదు వాణిజ్య ప్రణాళికల విషయంలోనూ ఎప్పుడూ మిగిలిన వారికంటే ఓ అడుగు ముందే నాగ్ ఉంటారనేది గతంలో ఎన్నోమార్లు రుజువైన విషయం.

### తెలుగు రాష్ట్రాల్లో కార్యాలయాలు...

అన్నపూర్ణ స్టూడియోస్ ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక పంపిణీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది ఇప్పుడు విశాఖపట్నంలో కూడా కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది, ఇది రెండు తెలుగు రాష్ట్రాలలో పెద్ద ఎత్తున విస్తరణకు సంకేతంగా చెప్పుకోవచ్చు. దాదాపు 50 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న నిర్మాణ సంస్థ నాగార్జున స్వంతం. ఇప్పుడు ఆయన మరిన్ని సినిమాలను నిర్మించాలని మరోవైపు తన పంపిణీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలని యోచిస్తున్నారని తెలుస్తోంది..ఆర్థికపుష్టి ఉన్న అగ్రహీరోల్లో ఒకరైన నాగార్జున డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి అడుగుపెట్టడం ప్రస్తుత అగ్రగామి పంపిణీదారులకు గట్టి పోటీ ఇవ్వడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

### పోటాపోటీ...పంపిణీ

తెలుగు రాష్ట్రాలలో పంపిణీ రంగం ఇప్పటికే పలు మార్పులకు నిదర్శనంగా నిలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ వంటి పెద్ద నిర్మాణ సంస్థలు సిండికేట్‌గా మారాయి. ఈ నేపథ్యంలో నాగార్జున ప్రవేశంతో రెండు రాష్ట్రాల్లో పంపిణీ ఆధిపత్యం కోసం జరిగే పోరు మరింత తీవ్రమవుతుందని సినీ పరిశీలకులు భావిస్తున్నారు. నిజాం, వైజాగ్ ప్రాంతాలలో ప్రధాన పంపిణీదారుగా దిల్ రాజు కొనసాగుతున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పంపిణీ రంగంలోకి ప్రవేశించిన తర్వాత, చాలా మంది నిర్మాతలు మైత్రి ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్‌తో, ముఖ్యంగా నిజాం ప్రాంతంలో, భాగస్వామ్యం కావడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా, ఏషియన్ థియేటర్స్‌కు చెందిన సునీల్, సురేష్‌బాబులు కొన్ని ఎంపిక చేసిన ప్రాజెక్టుల పంపిణీ బాధ్యతలు చేపడుతున్నారు.

### మారనున్న స్నేహాలు...

గత కొంత కాలంగా సితార ఎంటర్‌టైన్‌మెంట్‌స్‌కు చెందిన సూర్యదేవర నాగవంశీ నిర్మించిన చిత్రాలను దిల్ రాజు, క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నారు. అయితే, నిజాం ప్రాంతంలో ఇటీవల తన పంపిణీ కార్యాలయాన్ని ప్రారంభించిన అన్నపూర్ణ స్టూడియోస్‌తో ఇకపై నాగవంశీ భాగస్వామ్యం కావాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రతి సంవత్సరం బహుళ చిత్రాలను విడుదల చేస్తూన్న నాగవంశీ తెలుగు సినిమాలో అత్యంత చురుకైన విజయవంతమైన నిర్మాతలలో ఒకరనేది తెలిసిందే అంతేకాక దిల్ రాజుతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉన్నారు. ఈ మార్పు కార్యరూపం దాల్చితే, నిజాం ప్రాంతంలో దిల్ రాజు ఆధిపత్యానికి ఇది పెద్ద ఎదురు దెబ్బగా పరిణమించవచ్చు. ఓ వైపు పంపిణీదారులుగా మారుతున్న నిర్మాతల సంఖ్య పెరుగుతుండడం, సురేష్‌బాబు, అల్లు అరవింద్, సునీల్ నారంగ్ వంటి పంపిణీ రంగంలో స్థిరపడిన వారికి సవాలు గా మారనుందని, నాగార్జున ప్రవేశం తెలుగు సినిమా పంపిణీ వ్యాపారాన్ని పునర్నిర్వచించబోతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.



# యానిమేషన్ వెర్షన్‌లో ఆర్ఆర్ఆర్

రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా రూపొందిన బ్లాక్‌బస్టర్ మూవీ 'ఆర్ఆర్ఆర్'. రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆలియా భట్, అజయ్ దేవగణ్, ఒలీవియా మోరిస్ ఇతర పాత్రలుపోషించారు. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా 2022 మార్చి 24న విడుదలై, ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చాటింది. ఈ సినిమాని యానిమేషన్ వెర్షన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు రాజమౌళి. ఇటీవల హాలీవుడ్ మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన రాజమౌళి.. ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వం వహించిన 'బాహుబలి' తరహాలోనే 'ఆర్ఆర్ఆర్'ని యానిమేషన్ వెర్షన్‌లో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారాయన. ఈప్రాజెక్ట్ గురించి ప్రస్తుతం జపనీస్ స్టూడియోలతో చర్చలు జరుపుతున్నారట. అన్నీ కుదిరితే 'ఆర్ఆర్ఆర్' యానిమేటెడ్ మూవీ త్వరలోనే ట్రాక్ ఎక్కే అవకాశం ఉంది. ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

# ఇమాన్వికి బంపరాఫర్

ముందు చిన్న సినిమాలతో మొదలై.. కాలం కలిసి రావడంతో పెద్ద సినిమాలలో నటించేసి, స్టార్‌హీరోలతో జతకట్టి.. ఎట్టకేలకు తామూ స్టార్ హీరోయిన్లమే అనిపించుకోవడానికి హీరోయిన్లు పడే కష్టం అంతాఇంతా కాదు. కానీ.. మన ఇన్‌స్టా స్టార్ ఇమాన్వీ ఇస్మాయిల్ మాత్రం ఇవేమీ చేయకుండానే.. తొలి సినిమాకే ఏకంగా పానిండియా సూపర్‌స్టార్ ప్రభాస్‌కే హీరోయిన్ అయి కూర్చుంది.

'ఫౌజీ' సినిమాలో కథానాయికగా దర్శకుడు హను రాఘవపూడి ఈ ముద్దుగుమ్మను ఎంపిక చేయగానే.. 'తంతే బూరెల గంపలో పడటం అంటే ఇదే' అంటూ పలువురు అభిప్రాయాలు వెలిబుచ్చారు. నిజానికి కూడా ఆమె అదృష్టం మామూలుగా లేదు. ఎందుకంటే 'ఫౌజీ' నిర్మాణంలో ఉండగానే మరో భారీ అవకాశం ఈ అందాలభామను వరించినట్టు తెలిసింది. వివరాల్లోకెళ్తే.. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే.
ఈ సినిమాలో కథానాయికగా ఇమాన్వీ అయితే బావుంటుందనే అభిప్రాయాన్ని పవన్‌తో సురేందర్‌రెడ్డి వ్యక్తం చేశారట. పవన్ కూడా ఈ విషయంపై సానుకూలంగా స్పందించారట. ఈ విషయంలో తాను పట్టించుకోనని, పాత్రకు ఎవరు సూట్ అయితే.. వారినే ఎంపిక చేయమని పవన్ ఖరాకండీగా చెప్పారట. దాంతో ఇమాన్వీ ఎంపిక దాదాపు ఖరారైందని తెలిసింది. అదృష్టం ఉంటే అవకాశాలు వాటంతటవే వస్తాయనడానికి ఇంతకంటే ఉదాహరణ ఏంకావాలి?



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com